

నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365



# నేటి దర్శిని

WWW.NETIDARSHINI.COM

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

రంగారెడ్డి బుధవారం 20-05-2026 సంపుటి: 02 సంచిక : 19 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Wednesday, 20-05-2026 Volume :02 Issue: 19 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani





Contact Number
9059328777



## వణికిస్తున్న..ఎబోలా!



- ఆఫ్రికా దేశాలపై వైరస్ పడగ
- ఇప్పటికే వందల సంఖ్యలో మరణాలు
- ఇతర దేశాలకు పాకుతున్న వైరస్
- అప్రమత్తమైన భారత్..
- విదేశాల నుంచి వచ్చేవారికి ఇక స్క్రీనింగ్
- ఎయిర్‌పోర్టులు, నౌకాశ్రయాల వద్ద నిఘా

2లో

## ఇంటర్నెట్‌కూ..టోల్ గేట్!



- అంతర్జాతీయ టెక్ దిగ్గజాలకు షాక్
- అండర్ సీ డేటా కేబుల్స్‌పై టోల్ టాక్స్
- ఇరాన్ అల్లామొద్దీన్ స్ట్రార్టప్ ఐడియా
- టోల్ కట్టకపోతే మీ వైర్లు కట్ చేస్తాం
- ప్రపంచ వ్యాప్తంగా ఇంటర్నెట్ బంద్ అంటూ హెచ్చరికలు

2లో



### పండుగ వాతావరణంలో
## ఆవిర్భావ వేడుకలు

- తెలంగాణ ఆవిర్భావ వేడుకలపై ప్రభుత్వం స్పెషల్ ఫోకస్
- రాష్ట్ర ఆవిర్భావ వేడుకలపై ఉన్నత స్థాయి సమీక్ష
- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచన
- పరేడ్ గ్రౌండ్స్‌లో రిహార్సల్స్ చేయాలని అధికారులకు ఆదేశం
- ప్రత్యేకంగా నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం

హైదరాబాద్, మే 19 (నేటి దర్శిని)

జూన్ 2వ తేదీన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ నిర్ణయించింది. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రధాన వేడుకలు జరగనున్నాయి. ముందుగా గన్‌పార్క్‌లో అమరవీరులకు నివాళులు అర్పించనున్నారు సీఎం రేవంత్ రెడ్డి. మంగళవారం రాష్ట్ర ఆవిర్భావ వేడుకల ఏర్పాట్లపై సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉన్నతాధికారులకు తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. అన్నిశాఖలు సమన్వయంతో పనిచేయాలని వికాస్ రాజ్ సూచించారు. ప్రతి శాఖ నుంచి నోడల్ అధికారులను నియమించాలని ఆదేశించారు. పరేడ్ గ్రౌండ్ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలని మార్గనిర్దేశం చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని ఆదేశించారు. వాహనాల పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని నిర్దేశించారు.

-మిగతా 2 లో

### ప్రాజెక్ట్‌లపై..
# రేవంత్ దృష్టి

పాలమూరు- రంగారెడ్డి
ఎత్తిపోతల ప్రాజెక్టుకు భూసేకరణకు ఆదేశం



- యుద్ధప్రాతిపదికన పాలమూరు భూసేకరణ పూర్తి చేయాలి
- నిధుల చెల్లింపుల్లో జాప్యం వద్దు.. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- ఉమ్మడి మహబూబ్‌నగర్ మంత్రులు, ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి కీలక భేటీ
- ప్రాజెక్టుల పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధం
- సాగునీటి పథకాల పురోగతిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిందే
- సాగునీటి పథకాలపై దిశానిర్దేశం

హైదరాబాద్,మే 19 (నేటి దర్శిని)

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను దగ్గరుండి యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయించాలని మంత్రులను, ఎమ్మెల్యేలను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. మర్రి చెన్నారెడ్డి మానవవనరుల కేంద్ర కార్యాలయంలో మంగళవారం నాడు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి పలు కీలక సూచనలు చేశారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి వీలైనంత త్వరగా భూసేకరణ పూర్తి చేయాలని చెప్పారు. భూసేకరణ నిధుల విషయంలో జాప్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చూస్తామని

-మిగతా 2 లో



### నేడు మెడికల్
## షాపులు బంద్!

- 2.4 లక్షలకు పైగా మెడికల్ దుకాణాలు బంద్
- కార్పొరేట్ కంపెనీలు ఆన్‌లైన్‌లో డిస్కౌంట్లు ఇవ్వడంపై ఆందోళన
- ధరల నియంత్రణ విషయంలో నిబంధనలు పాటించడం లేదని ఆందోళన

న్యూఢిల్లీ,

దేశవ్యాప్తంగా ఈ నెల 20వ తేదీన (నేడు) 12.4 లక్షలకు పైగా మెడికల్ షాపులు మూతపడనున్నాయి. ఆలిండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ (ఏఐఓసీడీ) దేశవ్యాప్త బంద్ కు పిలుపునిచ్చింది. కార్పొరేట్ కంపెనీల అండదండలతో నడుస్తున్న ఆన్‌లైన్ ఫార్మసీలు భారీ డిస్కౌంట్లు ఇస్తూ సాంప్రదాయ మెడికల్ షాపులకు నష్టం కలిగిస్తున్నాయంటూ కెమిస్టులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్న ఫార్మసీ కంపెనీలు ఈ పోటీని తట్టుకోలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వారు చెబుతున్నారు. అనియంత్రిత ఆన్‌లైన్ అమ్మకాలు, ఈ-ఫార్మసీ డిస్కౌంట్లకు వ్యతిరేకంగా ఏఐఓసీడీ బంద్ కు

-మిగతా 2 లో



### నిప్పుల కొలిమిలా భారత్..
## అల్లాడుతున్న జనం!

- దేశవ్యాప్తంగా రికార్డు స్థాయికి ఉష్ణోగ్రతలు..
- 48 డిగ్రీలకు చేరిన భానుడి భగభగలు
- ఢిల్లీ, మహారాష్ట్రల్లో అత్యంత ప్రమాదకర పరిస్థితులు
- రాబోయే రోజుల్లో మరింత తీవ్రంగా వడగాల్పులు: ఐఎండీ హెచ్చరిక


న్యూఢిల్లీ, మే 19 (నేటి దర్శిని)

దేశం ఎండ వేడిమితో అట్టుడుకుతోంది. అనేక ప్రాంతాల్లో గతంలో ఎప్పుడూ లేని ఎండలు నమోదవుతున్నాయి. అనేక ప్రాంతాల్లో గరిష్టంగా 48 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇది అత్యంత ప్రమాదకర స్థాయి. దేశ రాజధాని ఢిల్లీతోపాటు మహారాష్ట్రలోని విదర్భలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రజలు ఈ ఎండ వేడిమికి తట్టుకోలేక అల్లాడిపోతున్నారు.రాబోయే రోజుల్లో ఎండలు మరింత పెరిగి, వడగాల్పులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది.

-మిగతా 2 లో

## భారత్‌లో తీవ్ర ఆర్థిక తుపాను

- శ్రామిక వర్గాన్ని నష్టపరిచేలా వ్యవహరిస్తున్న ప్రభుత్వం
- బిలియనీర్లకు ప్రయోజనం చేకూర్చేలా ఆర్థిక వ్యవస్థ రూపకల్పన
- లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ విమర్శలు



న్యూఢిల్లీ: మే 19 (నేటి దర్శిని)


భారత్‌లో ఎవరూ అడ్డుకోలేనటువంటి తీవ్రమైన ఆర్థిక తుపాను రాబోతుందని లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ హెచ్చరించారు. ప్రధాని మోడీ ఆర్థిక విధానాలు విఫలమవుతున్నాయని, ఆ తర్వాత వాటిల్లే భారీ నష్టాన్ని సామాన్యుడే ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. రాయ్‌బరేలీలో ఓ సభలో పాల్గొన్న రాహుల్, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలను తప్పుబట్టారు. శ్రామిక వర్గాన్ని నష్టపరిచి, బిలియనీర్లకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఆర్థిక వ్యవస్థను రూపొందించారని దుయ్యబట్టారు. పౌరులను విదేశీ ప్రయాణాలను తగ్గించుకోమని కోరుతున్న ప్రధాని, తాను మాత్రం తరచూ విదేశాలకు వెళ్తున్నారని విమర్శించారు. సమస్య పెట్రోల్, విద్యుత్ వాహనాలతో కాదని, అది ద్రవ్యోల్బణంతో

-మిగతా 2 లో

## నిరుద్యోగులకు శుభవార్త

- గరిష్ట వయోపరిమితి 44 ఏండ్లకు పెంపు
- మరో ఏడాది పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ

హైదరాబాద్ మే 19 (నేటి దర్శిని)



రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో గరిష్ఠ వయోపరిమితిని ప్రభుత్వం మరో ఏడాది పొడిగించింది. గరిష్ఠ వయోపరిమితిని 44 సంవత్సరాలకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు ఏడాది పాటు అమల్లో ఉంటాయని జీవోలో పేర్కొంది. పోలీసు తదితర యూనిఫామ్ సర్వీస్ లకు సడలింపు వర్తించదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

-మిగతా 2 లో



### ఇకపై వాట్సాప్‌లో
## ప్రభుత్వ సేవలు

- కొత్తగా తొమ్మిది పౌర సేవలు అందుబాటులోకి
- డిజిటల్ సేవలను మరింత విస్తరించిన ప్రజా ప్రభుత్వం
- ఇకపై వాట్సాప్ మీసేవలో మరిన్ని జీహెచ్‌ఎంసీ సేవలు
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

హైదరాబాద్, మే 19 (నేటి దర్శిని)

ఇకపై వాట్సాప్ లో ప్రభుత్వ సేవలు అందనున్నాయి. జీహెచ్‌ఎంసీకి సంబంధించిన పౌర సేవలను కొత్తగా మీసేవ వాట్సాప్, చాట్‌బాట్ ద్వారా తెలంగాణ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రజలకు మరింత సౌకర్యం, అందుబాటు, పారదర్శకత కల్పించే దిశగా ఈ సేవలను విస్తరించారు. ఈ మేరకు ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ విభాగం ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల

-మిగతా 2 లో

### పాలమూరు ప్రాజెక్టులు పూర్తి
## చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- జూరాలలో పూడికతీసి నీళ్ళు నిల్వ చేస్తాం
- కేసీఆర్ హయాంలో ఆప్రాజెక్టుకు భూసేకరణ లేకుండానే టెండర్లు పిలిచారు
- గత ప్రభుత్వం పాలమూరుకు చేసిన అన్యాయాన్ని ప్రజలకు వివరిస్తాం
- మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఆగ్రహం



హైదరాబాద్, మే 19 (నేటి దర్శిని)

పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. దేవాదుల, ఎస్ఎల్బీసీ, సీతారామ ప్రాజెక్టులతో సమాన ప్రాధాన్యం ఇస్తామని వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో పాలమూరు – రంగారెడ్డి పనులు 90శాతం పూర్తి అయ్యాయన్నది అసత్యమని అన్నారు. బీఆర్ఎస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. భూసేకరణ లేకుండానే టెండర్లు పిలిచారని విమర్శించారు. మంగళవారం సచివాలయంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

-మిగతా 2 లో

# వీధికుక్కలను తరలించాల్సిందే

ప్రజల ప్రాణాలతో చెలగాటం వద్దు

- ప్రతి జిల్లాలో పూర్తిస్తాయిలో బర్త్ కంట్రోల్
- అవసరమైతే ప్రమాదకరమైన కుక్కలకు కారుణ్య మరణం
- స్కూళ్లు, కాలేజీలు, బస్టాండ్లలో కుక్కలను లేకుండా చేయాలి
- అమలు చేయకపోతే రాష్ట్ర ప్రభుత్వాలపై కఠిన చర్యలు:
- గతంలో ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాల్సిందేనన్న సుప్రీం



న్యూఢిల్లీ, మే 19 (నేటి దర్శిని)

వీధికుక్కల బెడదను రూపుమాపాల్సిందేనని సుప్రీం మరోమారు స్పష్టం చేసింది. ఈ విషయంలో రాజీలేదని తెలిపింది. ఇది ప్రజల ప్రాణాల భద్రతకు సంబంధించిన అంశగా పేర్కొంది. బహిరంగ ప్రదేశాల్లో వీధి కుక్కలను తొలగించాలంటూ గతంలో జారీ చేసిన ఆదేశాలను ఉపసంహరించాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. గతంలో జారీ చేసిన ఆ ఉత్తర్వులను సవరించాలని చేసిన విజ్ఞప్తిని కూడా సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. స్కూల్, కాలేజీ, రైల్వే స్టేషన్, బస్టాండ్ తదితర బహిరంగ ప్రదేశాల్లో కుక్కలను తొలగించాలంటూ జంతు ప్రేమికులు దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు మంగళవారం విచారించింది.

-మిగతా 2 లో

### పండుగ వాతావరణంలో

# ఆవిర్భావ వేడుకలు

మొదటి తరువాయి



వాటర్ ప్రూఫ్ షామియానాలు, బారికేడింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. సభా ప్రాంగణంలో తాగునీరు, పారిశుధ్య ఏర్పాట్లు చేయాలని అన్నారు. పండుగ వాతావరణంలో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించాలని సూచించారు. అసెంబ్లీ, సచివాలయం, చార్మినార్ విద్యుత్ దీపాలతో అలంకరించాలని నిర్దేశించారు. రాష్ట్ర వేడుకలకు లైవ్ టెలికాస్ట్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మే 25వ తేదీ నుంచి పరేడ్ గ్రౌండ్‌లో సంయుక్త రిహార్సల్స్ నిర్వహించాలని వికాస్ రాజ్ మార్గనిర్దేశం చేశారు.

# ప్రాజెక్ట్‌లపై..రేవంత్ దృష్టి

మొదటి తరువాయి

ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు సిద్ధం

జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా మంత్రులు సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఈ భేటీలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, మేఘా రెడ్డి, రాకేష్ రెడ్డి, వంశీకృష్ణ, వీర్లపల్లి శంకరయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పాల్గొన్నారు.

### నేడు మెడికల్

# షాపులు బంద్!

మొదటి తరువాయి

పిలుపునిచ్చింది. ఈ బంద్ కారణంగా సాధారణ మందుల కొనుగోలు ఒకరోజు పాటు తీవ్రంగా ప్రభావితం కానుంది. ఆసుపత్రులకు అనుగుణంగా ఉన్న ఎమర్జెన్సీ ఫార్మసీలు మాత్రం తెరిచి ఉండే అవకాశం ఉంది. 20న బంద్ నేపథ్యంలో అత్యవసర మందులను ముందుగానే కొనుగోలు చేయాలని ఏఐఓసీడీ సూచించింది. ఈ బంద్‌లో కెమిస్టులు, ఫార్మాస్యూటికల్ డిస్ట్రిబ్యూటర్లు పాల్గొననున్నారు. ఆన్‌లైన్ ఫార్మసీని నియంత్రించాలని ఏఐఓసీడీ డిమాండ్ చేస్తోంది. ఆన్‌లైన్ కంపెనీలు తక్కువ ధరలకు మందులు విక్రయించడం వల్ల స్థానిక వ్యాపారులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. డాక్టర్ ప్రిస్క్రిప్షన్లు దుర్వినియోగం అవడమే కాకుండా, ఆన్‌లైన్‌లో విచ్చలవిడిగా విక్రయిస్తున్నారని పేర్కొంది. కార్పొరేట్ సెక్టార్లు ఇస్తున్న డిస్కౌంట్లను నియంత్రించాలని, ధరల నియంత్రణ విషయంలో నిబంధనలు పాటించకుండా నేషనల్ ప్రైస్ అథారిటీ ప్రకారం విక్రయాలు జరగాలని డిమాండ్ చేసింది. కొవిడ్ సమయంలో పేషెంట్లకు మందులు డోర్ డెలివరీ చేశారని, ఈ సౌకర్యాన్ని నిలిపివేయాలని కోరింది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తులు వెళ్ళినప్పటికీ, సరైన చర్యలు తీసుకోలేదని ఏఐఓసీడీ పేర్కొంది. అత్యవసర వైద్య సేవలకు అంతరాయం కలిగించకుండా, బంద్‌లో శాంతియుతంగా, చట్టబద్ధంగా పాల్గొనాలని డ్రగ్స్ కంట్రోల్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు జి.కోటేశ్వరరావు అన్నారు. ప్రజాప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, నిజమైన అత్యవసర పరిస్థితులలో మాత్రమే ఎమర్జెన్సీ మందులను సరఫరా చేయాలని అన్నారు. రోగులు, ప్రజలు, అధికారులు లేదా ఏజెన్సీలతో ఎటువంటి ఘర్షణకు దిగవద్దని కోరారు. అసత్య ప్రచారాలకు దూరంగా ఉండాలని కోరారు. బంద్ సమయంలో బలవంతపు మూసివేతలు, బెదిరింపులు, చట్టవిరుద్ధ కార్యకలాపాలను నివారించాలని పోలీసు శాఖను కోరారు. అంబులెన్సులు, అత్యవసర మందుల సరఫరా వాహనాలు, ఆరోగ్య సిబ్బంది సులభంగా రాకపోకలు సాగించేలా చూడాలని కోరారు.

### నిప్పుల కొలిమిలా భారత్..

# అల్లాడుతున్న జనం!

మొదటి తరువాయి

ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. మహారాష్ట్రలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. విదర్భ, అమరావతి పట్టణాల్లో 46.8 డిగ్రీలు, వార్ధాలో 46.5 డిగ్రీలు, అకోలాలో 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇతర పట్టణాల్లో కూడా ఇదే స్థాయిలో టెంపరేచర్ పెరుగుతోంది. మహారాష్ట్ర, ఢిల్లీలాంటి చోట్ల ఇప్పుడప్పుడే ఎండలు తగ్గే అవకాశం లేదని ఐఎండీ హెచ్చరించింది. అనేక ప్రాంతాల్లో 45 నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు చేరే అవకాశం ఉందని తెలిపింది. ఈ ప్రాంతంలో ఐఎండీ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఢిల్లీలో ఉష్ణోగ్రతలతోపాటు వాయు కాలుష్యం కూడా కలవరపెడుతోంది. ఈ వారం అంతా నార్త్ ఇండియా, సెంట్రల్ ఇండియా, వెస్టర్న్ ఇండియాలలో ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. భారీ ఎండల నేపథ్యంలో ఐఎండీ.. ప్రజలకు కీలక సూచనలు జారీ చేసింది. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దని, ఎండ ప్రభావానికి గురి కాకుండా చూసుకోవాలని, ఇండ్లలోనే ఉంటూ తగినన్ని నీళ్లు తాగాలి, ముఖ్యంగా పగటి పూట బయటకు వెళ్లొద్దని సూచించింది.

# నిరుద్యోగులకు శుభవార్త

మొదటి తరువాయి




తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత గరిష్ట వయోపరిమితిని పదేండ్ల పాటు సడలించారు. ఆ తర్వాత మరో రెండేండ్లు పొడిగించారు. ఆ గడువు కూడా ముగియడంతో నిరుద్యోగుల అభ్యర్థన మేరకు ప్రభుత్వం మరో ఏడాది పొడిగిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

# వణికిస్తున్న.. ఎబోలా!

-ఆఫ్రికా దేశాలపై వైరస్ పడగ
-ఇప్పటికే వందల సంఖ్యలో మరణాలు
-ఇతర దేశాలకు పాకుతున్న వైరస్
-అప్రమత్తమైన భారత్..
-విదేశాల నుంచి వచ్చేవారికి ఇక స్క్రీనింగ్
-ఎయిర్‌పోర్టులు, నౌకాశ్రయాల వద్ద నిఘా



**న్యూఢిల్లీ,**
ఆఫ్రికా నుంచి వచ్చే ప్రయాణికుల ద్వారా ఈ వైరస్ వ్యాపించే అవకాశం ఉన్నందున, ప్రధాన విమానాశ్రయాలు, నౌకాశ్రయాల వద్ద స్క్రీనింగ్ ప్రక్రియను ముమ్మరం చేశారు. లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వెంటనే క్వారంటైన్‌కు తరలించేలా ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా కాంగో, ఉగాండా దేశాల నుంచి వచ్చే వారి ప్రయాణ వివరాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్, ఐసీఎంఆర్ వంటి సంస్థలు ఎప్పటికప్పుడు మారుతున్న పరిస్థితులను పర్యవేక్షిస్తున్నాయి. ఆఫ్రికా దేశాల్లో మళ్లీ ఎబోలా వైరస్ పడగ విప్పడంతో భారత ప్రభుత్వం ఒక్కసారిగా అప్రమత్తమైంది. కాంగో, ఉగాండా దేశాల్లో ఈ వైరస్ కేసులు విపరీతంగా పెరుగుతుండటంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇప్పటికే పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించింది. ఈ నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రస్తుతానికి మన దేశంలో ఒక్క ఎబోలా కేసు కూడా నమోదు కాలేదని, ముప్పు చాలా తక్కువగా ఉందని స్పష్టం చేస్తూనే.. ముందుజాగ్రత్తగా నిఘా పెంచాలని అన్ని రాష్ట్రాలను ఆదేశించింది.


**పుణే ఎన్ఐవీ ల్యాబ్ సిద్ధం**
ఎలిబోలా నిర్ధారణ పరీక్షల కోసం పుణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీని నోడల్ ల్యాబ్‌గా ప్రభుత్వం ప్రకటించింది. ఏదైనా అనుమానిత కేసు వస్తే శాంపిల్స్‌ను వెంటనే ఇక్కడికి పంపి పరీక్షలు చేయనున్నారు. అవసరమైతే మరిన్ని ల్యాబ్‌లను కూడా ఈ నెట్‌వర్క్‌లోకి తీసుకువచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని, ఎబోలా వైరస్ నియంత్రణకు అవసరమైన అన్ని రకాల ఆరోగ్య మౌలిక సదుపాయాలు సిద్ధంగా ఉన్నాయని ఆరోగ్య మంత్రిత్వ శాఖ భరోసా ఇచ్చింది.

**వంద మందికి పైగా మృతి**
ఆలిఫ్రికాలో ఈ తాజా బుండిబుగ్యో స్ట్రెయిన్ ఎబోలా కారణంగా ఇప్పటికే వందలాది మంది మరణించినట్లు నివేదికలు అందుతున్నాయి. మరోవైపు, మే 28 నుంచి 31 వరకు ఢిల్లీలో ఇండియా–ఆఫ్రికా ఫోరమ్ సమ్మిట్ జరగనుంది. దీనికి కాంగో, ఉగాండాతో సహా పలు ఆఫ్రికా దేశాల ప్రతినిధులు హాజరయ్యే అవకాశం ఉంది. అలాగే జూన్ 1న ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ అలయన్స్ సదస్సు కూడా ఉంది. ఈ కీలక సమావేశాల నేపథ్యంలో విదేశీ ప్రతినిధుల ఆరోగ్య పరీక్షల విషయంలో కేంద్రం మరింత పకడ్బందీగా వ్యవహరిస్తోంది.

# ఇంటర్నెట్‌కూ..టోల్ గేట్!

-అంతర్జాతీయ టెక్ దిగ్గజాలకు షాక్
-అండర్ సీ డేటా కేబుల్స్‌పై టోల్ టాక్స్
-ఇరాన్ అల్లామొద్దీన్ స్టార్టప్ ఐడియా
-టోల్ కట్టకపోతే మీ వైర్లు కట్ చేస్తాం
-ప్రపంచ వ్యాప్తంగా ఇంటర్నెట్ బంద్ అంటూ హెచ్చరికలు

**న్యూఢిల్లీ,**
పశ్చిమాసియా యుద్ధ మేఘాలు ఇప్పటికే ప్రపంచాన్ని వణికిస్తుంటే ఇప్పుడు ఇరాన్ మరో అల్లామొద్దీన్ స్టార్టప్ ఐడియాతో అంతర్జాతీయ టెక్ దిగ్గజాలకు ప్యాంట్ తడిచేలా చేస్తోంది. ప్రపంచ సరఫరా దారుల్లో అత్యంత కీలకమైన 'హార్ముజ్ జలసంధి' గుండా వెళ్ళే చమురు ట్యాంకర్లకు టోల్ ట్యాక్స్‌లు వేయడం.. బెదిరించడం పాత చింతకాయ పచ్చడి కథ అయిపోయిందని ఇరాన్ భావించినట్టుంది. అందుకే రూటు మార్చి ఈసారి నేరుగా ప్రపంచానికి ఊపిరిగా మారిన 'ఇంటర్నెట్'కే టోల్ గేట్ వేయాలన్న సరికొత్త మాస్టర్ ప్లాన్‌తో బైహాన్ రంగంలోకి దిగింది.



గ్లోబల్ ఐటీ కారిడార్లలో భూకంపం

సముద్ర గర్భంలో మైళ్ళ కొద్దీ పరుచుకున్న అండర్‌సీ డేటా కేబుల్స్ పై ఫీజులు వసూలు చేయాలని ఇరాన్ గట్టిగా ఆలోచిస్తోందన్న వార్తలు ఇప్పుడు గ్లోబల్ ఐటీ కారిడార్లలో భూకంపం సృష్టిస్తున్నాయి. ప్రపంచమంతా సోఫాలో పడుకుని "ఇన్‌స్టాగ్రామ్ రీల్స్" చూస్తూ "ట్విట్టర్ మీమ్స్" షేర్ చేస్తూ టైమ్ పాస్ చేస్తుంటే.. ఆ డేటా అంతా ప్రవహించే అసలు సిసలైన వైర్లు తమ సముద్రం కింద నుంచే వెళ్తున్నాయని ఇరాన్ ఆలస్యంగా గుర్తించింది. అంతే.. వెంటనే గల్లా పెట్టె తెరిచి "అన్నా... వైర్లు మావయ్యా.. కాస్త టోల్ కట్టి వెళ్ళండయ్యా!" అంటూ సరికొత్త డిమాండ్లను తెరపైకి తెచ్చింది.

**సాంకేతిక లోపాలంటూ హెచ్చరికలు**
టెక్ దిగ్గజాలకు 'ఇరాన్' మార్క్ మెసేజీలు విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. సిలికాన్ వ్యాలీ సామ్రాజ్యాలైన గూగుల్, మైక్రోసాఫ్ట్, మెటా, అమెజాన్ వంటి టెక్ జెయింట్స్‌కు ఇరాన్ నుంచి ప్రత్యేకంగా 'అంబాసిడర్ లెటర్స్' వెళ్ళాయట. ఆ లెటర్స్ సారాంశం సింపుల్‌గా.. కానీ స్ట్రాంగ్‌గా ఉంటుందంటున్నారు. "మీరు గనుక సకాలంలో ఈ డేటా టోల్ ఫీజులు చెల్లించకపోతే.. అంతర్జాతీయ డేటా ట్రాఫిక్‌లో చిన్న చిన్న 'సాంకేతిక లోపాలు' అదేనండీ.. కేబుల్ కట్స్, సిగ్నల్ బ్లాక్స్ రావచ్చు. ఆ తర్వాత మీ ఇష్టం" అని ఇరాన్ పరోక్షంగా హెచ్చరికలు జారీ చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

### ఇకపై వాట్సాప్‌లో

# ప్రభుత్వ సేవలు

మొదటి తరువాయి

శ్రీధర్‌బాబు నాయకత్వంలో మీసేవ ద్వారా పౌర సేవలను మరింతగా తీర్చిదిద్దుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వ డిజిటల్ సేవల ప్రధాన వేదికగా ఉన్న మీసేవను వాట్సాప్, చాట్‌బాట్ ద్వారా మరింత విస్తరించారు. ఈ అదనపు డిజిటల్ ఛానల్స్‌ను 2025 నవంబర్ 18న ప్రారంభించారు. కొత్తగా జీహెచ్ఎంసీ ప్రాపర్టీ అసెస్‌మెంట్ రివిజన్, జనన ధ్రువీకరణ సవరణ, మరణ ధ్రువీకరణ సవరణ, బర్త్ హోమ్(ఇంటి దగ్గర పుట్టిన), డెత్ హోమ్(ఇంటి దగ్గర చనిపోయిన), ప్రాపర్టీ డోర్ నంబర్ సవరణ, ప్రాపర్టీ పేరు సవరణ, ప్రాపర్టీ ట్యాక్స్ సేవల, ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ సేవలను వాట్సాప్ మీసేవలో చేర్చారు. రాష్ట్రవ్యాప్తంగా పౌరులు ఈ సేవలను వాట్సాప్ ద్వారానే పొందవచ్చని ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ విభాగం తెలిపింది. సేవలు పొందేందుకు ముందుగా 8096958096 నంబర్‌ను మొబైల్‌లో 'మీసేవ తెలంగాణ' పేరుతో సేవ్ చేసుకోవాలి. అనంతరం వాట్సాప్‌లో ఆ నంబర్‌కు 'హాయ్' సందేశం పంపాలి. అవసరమైన సేవ పేరు టైప్ చేసి, మెనూలో కనిపించే ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. ఫారంలో అడిగిన వివరాలు, చెల్లింపు పూర్తిచేస్తే దరఖాస్తు వెంటనే వాట్సాప్ ద్వారా నమోదవుతుంది. వాట్సాప్ ఆధారిత మీసేవ వేదికకు ప్రారంభం నుంచి ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని ప్రభుత్వం వెల్లడించింది. జనన ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, పోలీస్ చలాన్, విద్యుత్ బిల్లు, బీఈడీ ఫలితాల సేవలను ప్రజలు ఎక్కువగా వినియోగిస్తున్నట్లు తెలిపింది. రోజువారీ పరిపాలన సేవలకు వాట్సాప్‌పై ప్రజల ఆధారపడటం పెరుగుతోందని పేర్కొంది. డిజిటల్ సేవలను నిరంతరం విస్తరించడం, ప్రభుత్వ వ్యవస్థల విశ్వసనీయతను బలోపేతం చేయడం, పౌరులకు సులభమైన అనుభవం కల్పించడం తమ లక్ష్యమని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది.

### వీధికుక్కలను

# తరలించాల్సిందే

మొదటి తరువాయి

ఈ సందర్భంగా జంతు సంక్షేమ బోర్డు దాఖలు చేసిన అన్ని పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ సందర్భంగా తన తీర్పులో.. పలు కీలక అంశాలను సుప్రీంకోర్టు ప్రస్తావించింది. వీధి కుక్కల సమస్యను జంతు సంక్షేమ అంశంగా కాకుండా ప్రజల ప్రాణాల భద్రతకు సంబంధించిన అంశంగా పరిగణించాలని పిటిషనర్లకు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా రూపొందించిన నియమావళిని సమర్థవంతంగా అమలు చేయడం కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు సూచించింది. ప్రతి జిల్లాలో కనీసం ఒక పూర్తి స్థాయి యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని స్పష్టం చేసింది. జనాభాను దృష్టిలో ఉంచుకొని అవసరమైతే జిల్లాలో ఈ కేంద్రాల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించింది. యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా నిబంధనలు కచ్చితంగా అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రజల భద్రత దృష్టిలో ఉంచుకుని స్కూళ్లు, కాలేజీలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లతోపాటు ఇతర ప్రదేశాల్లో కూడా ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. దేశవ్యాప్తంగా యాంటీ రేబిస్ మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. రహదారులపై సంచరించే పశువుల సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియాకు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జాతీయ రహదారులపై తిరిగే జంతువుల సమస్యల పర్యవేక్షణ కోసం ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఎన్‌హెచ్ఏఐను కోరింది. రేబిస్ బారిన పడిన లేదా మానవుల ప్రాణాలకు ముప్పుగా పరిణమించే ప్రమాదకర కుక్కల విషయంలో చట్టబద్ధంగా అనుమతించిన చర్యలు తీసుకోవచ్చని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా స్పష్టం చేసింది. కోర్టు ఆదేశాల అమలు కోసం విధులు నిర్వహించే ఉద్యోగులకు తగిన రక్షణ కల్పించాలని ప్రభుత్వాలకు సూచించింది. విధులు నిర్వర్తించే క్రమంలో వారిపై బలవంతపు చర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది.

# భారత్‌లో తీవ్ర ఆర్థిక తుపాను

మొదటి తరువాయి

అని ప్రధాని అర్థం చేసుకోవాలని సూచించారు. వెంటనే చర్యలు తీసుకుని దేశాన్ని రక్షించాలని కోరారు. 'భారీ ఆర్థిక తుపాన్ రాబోతోంది. దీన్ని ఎవరూ అడ్డుకోలేరు. అంత తీవ్రమైన ఆర్థిక తుపాన్ రాబోతోంది. అది ఎంతపెద్దది అంటే మీరు, నేను మన జీవితంలో ఎప్పుడూ చూడలేనంత పెద్దది. దెబ్బ ఎవరికి తగులుతుంది? అంబానీ, అదానీలకు తగలదు. వాళ్లు తమ ప్యాలెస్‌లో కూర్చుని ఉంటారు. వాళ్ల ప్యాలెస్ చుట్టూ భద్రత ఉంటుంది. భారత రైతుకు, కార్మికుడికి, యువతకు, చిన్న వ్యాపారస్థులకు, చిన్న పరిశ్రమలకు దెబ్బతగులుతుంది. ఏవైతే ఉపాధిని కల్పిస్తాయో, వాటికి నష్టం కలగనుంది. ఇప్పుడు మేము చెప్తున్నాం నెలల ముందు నుంచే నేను చెప్తున్నాను. ఆర్థిక తుపాన్ వస్తోంది, సిద్ధం కావాలి అని. ప్రజలకు భారీ దెబ్బ తగలబోతోంది. పెట్రోల్ ధరలు పెరగబోతున్నాయని, ద్రవ్యోల్బణం ఆకాశాన్ని తాకబోతోందని చెబుతున్నాను. వాళ్లేమో (బీజేపీ) రాహుల్ గాంధీకి ఏం అవగాహన లేదని అంటున్నారు. ఇరాన్– అమెరికా మధ్య యుద్ధం చెలరేగడంతో మన ఇంధన సరఫరాను ఇరాన్ నిలిపివేసింది. ఫలితంగా దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడింది. పెట్రోల్, డీజిల్‌ను పొదుపుగా వాడుకోవాలని, ఎలక్ట్రిక్ వాహనాలకు మారాలని మోడీ ప్రజలకు సలహా ఇస్తున్నారు. కానీ, మరుసటి రోజే మోడీ స్వయంగా విదేశాలకు వెళ్తున్నారు--రాహుల్ గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత ప్రస్తుత కేంద్ర ప్రభుత్వాన్ని మార్చకపోతే దేశం మనుగడ సాగించలేదని లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. రాజకీయ వాస్తవాలపై ప్రజలు పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో అవగాహన లోపించడం వల్లే ఎంజీఎన్ఆర్ఈజీఏ వంటి గ్రామీణ సామాజిక భద్రతా కార్యక్రమాలు పూర్తిగా రద్దు అవుతున్నాయని, చిన్న రైతులు ఆర్థికంగా నాశనమవుతారని హెచ్చరించారు. మరోవైపు దేశ అగ్ర నాయకులు మాత్రం కార్పొరేట్ సామాజిక కార్యక్రమాలకు హాజరుకావడానికే దృష్టి సారిస్తున్నారని ఆరోపించారు.

### పాలమూరు ప్రాజెక్టులు పూర్తి

# చేయడమే ప్రభుత్వ లక్ష్యం

మొదటి తరువాయి



ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. పాలమూరుకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుతామని చెప్పుకొచ్చారు. జూరాల ప్రాజెక్టులో పూడిక తొలగించి నిల్వ సామర్థ్యం పెంచుతున్నట్లు తెలిపారు. డి ఆర్ ఐ పి కింద జూరాల అభివృద్ధికి ప్రతిపాదనలు చేశామని వివరించారు. వర్షాకాలానికి ముందే చెరువుల్లో పూడికతీత పనులు చేపడతామని స్పష్టం చేశారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. 1226 గ్రామాలకు తాగునీరు అందిస్తామని తెలిపారు. 15 రోజుల్లో మరోసారి ప్రగతి సమీక్ష నిర్వహిస్తామని చెప్పుకొచ్చారు. ఆయా ప్రాజెక్టుల పురోగతిపై సమగ్ర నివేదికలు ఇవ్వాలని అధికారులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు.



# పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయండి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం
- పెండింగ్ బిల్లుల చెల్లింపుకు ప్రభుత్వం సిద్ధం
- పాలమూరు ఉమ్మడి జిల్లా మంత్రులు ఎమ్మెల్యేలకు సూచించిన ముఖ్యమంత్రి



**మిడ్జిల్, మే 19, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియ దగ్గరుండి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి పాలమూరు జిల్లా మంత్రులకు ఎమ్మెల్యేలకు స్వయంగా సూచించారు. మంగళవారం తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని మంత్రులు జూపల్లి కృష్ణారావ, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, మేఘారెడ్డి, రాకేష్ రెడ్డి, వంశీకృష్ణ, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తదితరులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రత్యేకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారితో మాట్లాడినట్లు చైర్మన్ వీర్లపల్లి శంకర్ తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి పలు కీలక సూచనలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసినట్లు వీర్లపల్లి శంకర్ తెలిపారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి వీలైనంత త్వరగా భూసేకరణ పూర్తి చేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. భూసేకరణ నిధుల విషయంలో జాప్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చూస్తామని సీఎం పేర్కొన్నారని ఆయన స్పష్టం చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా మంత్రులు సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఇతర సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి మంత్రులు ఎమ్మెల్యేలు తీసుకెళ్లారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారని తెలిపారు. జిల్లాలో సమస్యల పరిష్కారం పనుల్లో పురోగతిపై మంత్రుల ఆధ్వర్యంలో తరచూ తనను కలవాలని సీఎం ఆదేశించినట్లు తెలిపారు. ఇ భేటీ సందర్భంగా ఎమ్మెల్యే, రాష్ట్ర భద్రత సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ సంతోషం వ్యక్తం చేశారు. యుద్ధ ప్రాతిపదికన పాలమూరు రంగారెడ్డి సాగునీటి ప్రాజెక్టు తీరుపై స్పందించి భూసేకరణ వాటికి చెల్లించాల్సిన బిల్లులతో పాటు పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలియజేయడం ఎంతో శుభ పరిణామం అని తెలిపారు. లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ నిర్మాణానికి ఒక్కొక్కటిగా సమస్యలు తీరిపోతున్నాయని వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి స్వయంగా ధన్యవాదాలు తెలియజేసినట్లు తెలిపారు..

# మాడుగుల మండల కేంద్రంలో డిసిపి ఆకస్మిక తనిఖీలు...



**మాడ్గుల,మే19(నేటి దర్శిని);**
మాడ్గుల మండల కేంద్రంలో మహేశ్వరం జోన్ డిసిపి నారాయణరెడ్డి మంగళవారం మండల కేంద్రంలో ఆకస్మికంగా పర్యటించారు. ఇబ్రహీంపట్నం కెవిపి రాజుతో కలిసి ముందుగా వడ్ల కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల కోసం త్రాగునీరు, నీడ కొరకు కూర్చునే ఏర్పాట్లు,టోకెన్ విధానం,పారిశుద్ధ్యం, సక్రమంగా తూకం వేయాలని అధికారులను డీసీపీ ఆదేశించారు. రైతుల ఫిర్యాదులకు తక్షణ స్పందన ఉండాలని, ట్రాఫిక్ సమస్యలు రాకుండా స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకోవాలన్నారు. అనంతరం మాడుగుల పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసి ఆయా స్టేషన్ రికార్డులు,పెండింగ్ పిటిషన్లను,క్రైమ్ రికార్డులు,రౌడీ షీట్లు, హిస్టరీ షీట్లు,బీట్ బుక్స్, సీసీటీవీ పనితీరును పరిశీలించారు. పోలీసులు ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని,రాత్రి గస్తీ వాహన తనిఖీలు,బీట్ పోలీసింగ్ పటిష్టం చేయాలని సూచించారు. రౌడీ షీటర్లు అనుమానితులపై నిఘా పెంచి నేరాలు అరికట్టాలని ఆదేశించారు.గ్రామం పెద్దలతో సమన్వయంతో కమ్యూనిటీ పోలీసింగ్ అమలు చేయాలని తెలిపారు.మాడుగుల పోలీస్ స్టేషన్ సిబ్బంది పనితీరును డీసీపీ అభినందించారు.ఈ కార్యక్రమంలో సిఐ వేణుగోపాల్,ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే తరలించాలి..

- ఎన్ ఫోర్స్ మెంట్ సివిల్ సప్లై డిఎస్పి రమేష్...



**ఆమనగల్లు,మే19(నేటి దర్శిని);**
రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే గోదాములకు తరలించాలని ఎన్ ఫోర్స్ మెంట్ సివిల్ సప్లై డి.ఎస్.పి రమేష్ అన్నారు. మంగళవారం ఆమనగల్లు లో మార్కెట్ యార్డ్ లోని కొనుగోలు కేంద్రాన్ని ఎన్ఫోర్స్మెంట్ సివిల్ సప్లై డిఎస్పి రమేష్ జిల్లా పౌరసరఫరాల అధికారి వనజాత ఆకస్మికంగా సందర్శించారు. రైతులతో మాట్లాడి ధాన్యం కొనుగోలు విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మార్కెట్ ఆవరణలో రైతులకు ఎనిమిది మిషన్స్ కలవు అని రైతులు వినియోగించుకోవాలని సూచించారు.ఇప్పటివరకు పదివేల క్వింటాళ్ల ధాన్యాన్ని తరలించినట్లు, ధాన్యం తరలింపులో లారీల సమస్య ఉండవద్దని కాంట్రాక్టర్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి డైరెక్టర్లు తాళ్ల రవీందర్, రమేష్, సంపత్,నరేష్ నాయక్, పిఎసిఎస్ సీఈవో దేవేందర్, కేఎన్ఆర్ వ్యవస్థాపక అధ్యక్షుడు మెకానిక్ బాబా,శ్రీను, మరియు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# తీదేడు గ్రామంలో భవానీ రామలింగేశ్వర స్వామి దక్షిణ మండప నిర్మాణానికి విరాళాలు





- స్వామివారి ఆశీస్సులు పొందాలి : సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి

**చింతపల్లి, మే 19 (నేటి దర్శిని):**
చింతపల్లి మండలం తీదేడు గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి దక్షిణ మండప నిర్మాణానికి గ్రామ ప్రజలు, యువత స్వచ్ఛందంగా విరాళాలు అందించడం అభినందనీయమని తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి, ఉప సర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా తీదేడు గ్రామానికి చెందిన మద్రు జయసుధ -- సురేందర్ రావు దంపతులు రూ.1,00,116/- విరాళంగా అందించగా, తీదేడు బీసీ కాలనీ యూత్ ఆధ్వర్యంలో రూ.20,116/- విరాళం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీ శ్రీ శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి ఆశీస్సులతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. దక్షిణ మండప నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. గ్రామ ప్రజలు ఐక్యంగా ఆలయ అభివృద్ధికి ముందుకు రావడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్లు ధరణిపతి రమణారావు, ఉలుపాల శేఖర్ రెడ్డి, సోనగంటి గోవర్ధనాచారి, పి.ఏ.సి.యస్ డైరెక్టర్ తిరుమణి పాపయ్య, గ్రామ ప్రజలు సిమర్ల శ్రీను యాదవ్, బొడ్డు యాదగిరి, బెక్కం సైదులు, శివర్ల ప్రవీణ్, బెక్కం సాయి కుమార్, మొరుపోజు రాజు, మునగాల రవి, మునగాల లక్ష్మణ్, ఐతమోని కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు సన్మానం....



**తలకొండపల్లి, మే19(నేటి దర్శిని);**
తలకొండపల్లి మండలం వెల్జాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్య... పాత్య జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన్న పాఠశాల విద్యార్థులు స్పందన,చందు,శివ,ను మంగళవారం వెల్జాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడా దుస్తులు అందజేసి శాలువాలతో వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నసీమా సుల్తానా, ఉపాధ్యాయులు, నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# మిడ్జిల్ మండల కేంద్రంలో చురుకుగా కొనసాగుతున్న జనగణన...



**మిడ్జిల్ ,మే19(నేటి దర్శిని ప్రతినిధి);**
మిడ్జిల్ మండల కేంద్రంలో జనగణన 2026 ను ఏన్యుమరేటర్లు,ఎండలను సైతం లెక్కచేయకుండా ఇంటింటికి తిరుగుతూ జన గణనను చురుకుగా కొనసాగిస్తున్నారు.ఈ కార్యక్రమంలో పి. ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

- వాల్ పోస్టర్ ఆవిష్కరణలో జిల్లా కార్యదర్శి చెల్లం పాండురంగారావు పిలుపు

**చింతపల్లి, మే 19 (నేటి దర్శిని):**
తెలంగాణ ప్రజానాట్యమండలి నాలుగవ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి చెల్లం పాండురంగారావు పిలుపునిచ్చారు. చింతపల్లి మండల పరిధిలోని గోడుకొండ్ల వీటి నగర్లో మహాసభల వాల్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను కళారూపాల ద్వారా సమాజానికి చేరవేస్తూ సాంస్కృతిక ఉద్యమాలకు



తెలంగాణ ప్రజానాట్యమండలి దిశానిర్దేశం చేస్తోందన్నారు. కళాకారులు సమాజ మార్పుకు వారధులుగా నిలవాలని, ప్రజల పక్షాన నిలిచే కళా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ నెల 25, 26 తేదీలలో హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లో జరిగే రాష్ట్ర మహాసభలకు కళాకారులు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. అలాగే ఈ నెల 22న నల్లగొండ పట్టణంలో జరిగే తెలంగాణ ప్రజానాట్యమండలి నాలుగవ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి మండల మాజీ ఎంపీపీ భవాని పవన్ కుమార్, మాజీ జెడ్పిటిసి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాస మంజుల భాస్కర్, ఉప సర్పంచ్ మహమ్మద్ ఖలీల్, వార్డు మెంబర్ సైదులు తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## లోపభూయిష్టం




దేశంలో వివాదాస్పదమై ఇంకా సుప్రీం కోర్టు ముందున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు మరో 16 రాష్ట్రాల్లో, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో చేపడతామన్న భారత ఎన్నికల సంఘం ప్రకటన ఆందోళన కలిగిస్తోంది. ఎస్ఐఆర్ మూలంగా పశ్చిమ బెంగాల్ లో 90 లక్షల మంది ఓట్లు తొలగించారు. ఆ రాష్ట్ర ఎన్నికలపై ఎస్ఐఆర్ ప్రభావం మెండుగా ఉందని లోకం కోడై కూసింది. ఎస్ఐఆర్ ప్రక్రియ జరిగిన 105 సీట్లలో బీజేపీ గెలవగా వాటిలో 35 సీట్లలో ఎస్ఐఆర్ తొలగించిన ఓట్ల కన్నా తక్కువ మార్జిన్ తో బీజేపీ గెలిచింది. ఇప్పుడా సీట్లలో ఓడిన అభ్యర్థులు కోర్టులో కేసులు దాఖలు చేస్తున్నారని వార్తలొస్తున్నాయి. ఓటర్ల జాబితా అక్రమాల్లో ఎస్ఐఆర్ ను కారణంగా చూపితే ఆ కేసుల్ని విచారిస్తామని గతంలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తే ప్రకటించియున్నారు కూడా! ఎస్ఐఆర్ అమలులో లోపాలున్నాయన్న విషయం బహిరంగ రహస్యం. సాక్షాత్తు సుప్రీంకోర్టు బెంగాల్ లో ఎస్ఐఆర్ ట్రిబ్యునళ్లకు విచారణా ధికారులుగా న్యాయాధికారులను నియమించింది. అంతకు ముందు ఎస్ఐఆర్ అమలు చేసిన బీహార్, తమిళనాడు, కేరళం తదితర రాష్ట్రాల్లోనూ అక్రమాలు జరిగాయి. అటువంటి ఎస్ఐఆర్ ను ఇప్పుడు మూడవ దశ పేరిట అమలుకు పూనుకోవడం దారుణం. అంతేగాక బెంగాల్ ఎన్నికల ప్రక్రియ ఎంతో లోపభూయిష్టంగా జరిగిందన్నది నగ్న సత్యం. ఆ రాష్ట్ర సిఈఓగా పని చేసిన పెద్దమనిషి బీజేపీ అధికారానికి వచ్చాక అమాంతం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కావడం అందుకో తార్కాణం. అసలు ఈ ఎస్ఐఆర్ ను ముందుకు తెచ్చిన ప్రస్తుత ఎన్నికల ప్రధాన కమిషనర్ పార్లమెంటులో అభిశంసనను సైతం ఎదుర్కొంటున్న పరిస్థితి నెలకొంది. ఏ విధంగా చూసినా ఎస్ఐఆర్ ఒక వివక్షా పూర్వక ప్రక్రియ. ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రక్రియ కీలకమైనది. ఎన్నికలకు ప్రాతిపదిక ఓటరు జాబితా. అది లోపరహితంగా ఉంటేనే ఎన్నిక సక్రమం అవుతుంది. అలాగే ఎన్నికల నిర్వాహకులు నిరపేక్షంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. కానీ బీజేపీ అధికారానికి వచ్చాక మిగతా రాజ్యాంగ వ్యవస్థల మాదిరిగా ఎన్నికల కమిషన్ ను కూడా తమ పరివారంతో నింపేసుకున్నారు. ఆ క్రమంలోనే సిఈసి నియామకం కూడా! అసలు నియామక ప్రక్రియలోనే తిరకాసు ఉంది. గురువారం నాడు జరిగిన విచారణలో సాక్షాత్తూ సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ దీపాంకర్ దత్తా వ్యాఖ్యల్లోనూ అది దాగుంది. ప్రధాని అధ్యక్షతన గల ఎంపిక కమిటీలో తటస్థులు ఒక్కరైనా లేరన్న నగ్న సత్యాన్ని ఆయన ప్రస్తావించారు. దానికి సమాధానం ఇవ్వాల్సిన అటార్నీ జనరల్ సుప్రీం కోర్టు మరో పార్లమెంటు ఛాంబర్ కాలేదని అడ్డగోలు వాదనలు చేయడం విస్తుగొలుపుతోంది. మొదటి రెండు రౌండ్లలో తీవ్ర అవకతవకలు జరిగిన ఎస్ఐఆర్ అమలును వెంటనే ఉపసంహరించాలి. ఇప్పటికే పలు ఆరోపణల్లో చిక్కుకొని సుప్రీం కోర్టు ఎదుట కేసు, పార్లమెంటు ముందు అభిశంసన పెండింగ్ లో ఉన్న సిఈసికి మూడవ దశ ఎస్ఐఆర్ ప్రకటించే నైతిక అధికారం కూడా లేదన్న పరిశీలకుల వ్యాఖ్యల్ని ఎవరూ కొట్టి పారెయ్యలేరు. ఇతర రాష్ట్రాలన్నిటి ఎస్ఐఆర్ అమలు అనుభవమూ అవకతవకల మయమే కనుక తెలుగు రాష్ట్రాల్లో దాని అమలును నిలిపివేయాలి. బీజేపీ యేతర రాజకీయ పార్టీలు ఈ లోపభూయిష్ట విధానాన్ని ప్రతిఘటించాలి. ప్రజాస్వా మ్యానికి మూలమైన ఎన్నికల ప్రక్రియను తొత్తడం చేసే ఎస్ఐఆర్ ను ప్రజలు వ్యతిరేకించాలి. ఆ దిశగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టాలి. ఓటు హక్కు అనేది పాలక వర్గాలు పేదలకు ఇచ్చిన "భిక్ష" కాదు. అది సుదీర్ఘ పోరాటాలు, త్యాగాల ద్వారా సాధించుకున్న ప్రాథమిక హక్కు. ఓటు హక్కు అనేది రాజ్యాంగం పౌరుడికి కల్పించిన అత్యున్నత ఆయుధం. వ్యవస్థను ప్రక్షాళన చేసే పేరుతో నిరుపేదలను, కార్మికులను ఆ హక్కుకు దూరం చేస్తే అది ఎన్నికల సంఘం సాధించే విజయం కాబోదు; అది ప్రజాస్వామ్య స్ఫూర్తిని చంపేయడమే. కాబట్టి, కేవలం మూడు సార్లు ఇల్లు తాళం వేసి ఉంటే ఓటు తీసేయాలనే నిబంధనను పూర్తిగా రద్దు చేయాలి. స్థానిక కార్మిక సంఘాలు, ప్రజాతంత్ర శక్తుల సమక్షంలోనే తుది జాబితాను ఖరారు చేయాలి. అప్పుడే ఈ "ప్రత్యేక సమగ్ర సవరణ"కు ఒక అర్థం ఉంటుంది. ఈ సమగ్ర సవరణ ప్రక్రియలో ప్రతి ఒక్క అర్హుడికీ ఓటు హక్కు సురక్షితంగా ఉండేలా చూడటమే కాకుండా, 18 ఏళ్లు నిండిన ప్రతి యువతీ యువకుడిని ఓటరుగా చేర్చేలా ప్రభుత్వం, అధికారులు పారదర్శకంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలి.

# మొన్నటిదాకా ఎన్నికలతో బిజీ..
# ఇప్పుడు రష్యన్ ఆయిల్ కోసం అమెరికాను వేడుకుంటున్న మోడీ

న్యూఢిల్లీ మే 19 (నేటి దర్శిని)
ఇంధన ధరల్ని పెంచి కేంద్రం ఆర్థిక వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టింది. ప్రస్తుత ఆర్థిక సంక్షోభం.. మోడీ ప్రభుత్వం సృష్టించిందేనని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు చేశారు. ఈమేరకు ఆయన మంగళవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. 'ధరల పెంపు జరిగిన కేవలం నాలుగు రోజుల తర్వాత మోడీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరల్ని మరోసారి పెంచింది. పొదుపు గురించి ప్రబోధిస్తూ, తమ వైఫల్యాల భారాన్ని ప్రజలపై మోపుతున్నారు. ప్రపంచ గురువుగా చెప్పుకునే మోడీజీ ఇప్పుడు రష్యా చమురు కొనుగోలు ఇచ్చిన అనుమతిని ఒక నెల పొడిగించమని అమెరికాను బతిమాలుతున్నారు. అతను (మోడీ) ఇలా చేసిన ప్రతిసారి 140 బిలియన్ల భారతీయు గౌరవాన్ని దెబ్బతీస్తూనే ఉన్నాడు. గతంలో ఏ ప్రభుత్వమూ ఈ స్థాయికి దిగజారలేదు అని దుయ్యబట్టారు. బలహీన



దేశాలకు సహాయం చేసేందుకు సముద్రంలో చిక్కుకుపోయిన రష్యా చమురుపై అమెరికా 30 రోజుల పాటు మినహాయింపును పొడిగించిన నేపథ్యంలో భారత్‌లో తాజాగా ఇంధన ధరలను పెంచడం వెనుక ఉన్న కారణం ఏంటి? అని ఖర్గే కేంద్రాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం చెబుతున్నట్లు.. ఇలా చేయడానికి అనుమతి ఉన్నట్లయితే.. ప్రజలపై భారాలు ఎందుకు మోపుతున్నారు? ఈ బిజెపి ప్రభుత్వానికి దూరదృష్టి లేదు అని ఖర్గే విమర్శించారు. సంక్షోభం వచ్చినప్పుడు, వారు (మోడీ) ఎన్నికలతో తీరిక లేకుండా ఉన్నారు. ఆ తర్వాత దోపిడీకి ఒక పథకాన్ని రూపొందించడానికి జిత్తులమారి మాటలు మాట్లాడారు. ఈలోగా తమ ప్రాణ స్నేహితుడిని కూడా గట్టెక్కించారు! కేవలం విదేశాల్లో ప్రాయోజిత ప్రచార కార్యక్రమాలు చేసినంత మాత్రాన 'విశ్వగురువు' అయిపోరు. మోడీజీ మీరు ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలి. అసలైన ప్రశ్నల నుండి పారిపోకండి. మీరు మామిడి పండ్లను ఎలా తింటారు లేదా ఏ టానిక్ తాగుతారు అనే విషయాలపై ప్రజలకు ఆసక్తి లేదు. ఈ సంక్షోభం నుండి గట్టెక్కడానికి మీరు వాస్తవంగా ఏమి చేస్తున్నారో ప్రజలకు చెబితేనే నిజమైన ప్రధాన సేవక్‌గా ఉంటారు. లేకపోతే కేవలం ఒక ప్రచారకర్తగానే మిగిలిపోతారు అని ఖర్గే సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు.

# ఇరాన్‌పై మళ్లీ భీకర దాడులు..

### ట్రంప్ తాజా హెచ్చరిక

న్యూఢిల్లీ మే 19 (నేటి దర్శిని)
రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ ప్రతిష్టంభన కొనసాగుతున్న నేపథ్యంలో దాడులను నిలిపివేసిన కొన్ని గంటలకే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మళ్లీ తీవ్ర హెచ్చరికలు జారీచేశారు. మనం యుద్ధం చేయాల్సిన అవసరం రాదని ఆశిస్తున్నాను. కానీ వారికి మరో పెద్ద దెబ్బ ఇవ్వాల్సి రావచ్చు. నాకు ఇంకా కచ్చితంగా తెలియదు. త్వరలోనే మీకు తెలుస్తుంది అని మంగళవారం వైట్ హౌస్‌లో విలేకరులతో మాట్లాడుతూ ట్రంప్ అన్నారు. ఇరాన్‌కు అణ్వాయుధం ఉండటానికి మేము అనుమతించలేము. అందుకే ఒప్పందం చేసుకోవడానికి వారికి పరిమిత



సమయం ఇస్తున్నాము అని ట్రంప్ చెప్పారు. ఇరాన్‌తో ప్రస్తుతం జరుగుతున్న ఘర్షణను ట్రంప్ గట్టిగా సమర్థించుకున్నారు. విమర్శకులు భిన్నంగా చెబుతున్నప్పటికీ ఇప్పటివరకు జరిగిన సైనిక చర్యకు చాలా ప్రజాదరణ లభించిందని ట్రంప్ అన్నారు. దీనికి ప్రజాదరణ ఉన్నా లేకపోయినా నేను దీన్ని చేయాల్సిందే అని ఆయన అన్నారు. ప్రపంచం పేలిపోకుండా కాపాడటానికే తాను ఈ చర్య తీసుకుంటున్నానని ఆయన తెలిపారు. ఇరాన్‌పై మరోసారి సైనిక దాడి ఉండవచ్చని ఆయన సూచించారు. దాడిపై నిర్ణయం తీసుకోవడానికి కేవలం ఒక గంట దూరంలోనే ఉన్నానని ఆయన చెప్పారు.


**హార్ముజ్‌ని ఏ శక్తీ తెరవలేదు : ఇరాన్**

ఉద్రిక్తతలు పెరుగుతున్న తరుణంలో హార్ముజ్ జలసంధిపై ఇరాన్ కీలక హెచ్చరిక చేసింది. ఈ జలమార్గం మునుపటి స్థితికి ఎప్పటికీ తిరిగిరాదని, ఇరాన్ ఆమోదం లేకుండా దానిని తెరవగల శక్తి ఏదీ లేదని ఇరాన్‌కు చెందిన ఒక ఉన్నతస్థాయి చట్టసభ సభ్యుడు ప్రకటించారు.

# పాకిస్తాన్ కరెన్సీ కంటే భారత రూపాయి తగ్గుదల

### మరో రికార్డ్ కనిష్టానికి రూపీ

న్యూఢిల్లీ మే 19 (నేటి దర్శిని)
పాకిస్తాన్ రూపాయి కరెన్సీతో పోల్చినా భారత కరెన్సీ భారీ తగ్గుదలను చవి చూసింది. గడిచిన ఏడాది కాలంలో పాకిస్తాన్ రూపాయి (పికెఆర్)తో పోలిస్తే భారత కరెన్సీ క్షీణతను చవి చూసింది. 2025 మే 15 మార్పిడి రేటు ప్రతి ఒక భారత రూపాయికి 3.2913 పాకిస్తాన్ రూపాయలుగా ఉండగా, 2026 మే 18 నాటికి అది 2.9010 పాకిస్తాన్ రూపాయలకు బలపడింది. దీంతో పోల్చితే భారత కరెన్సీ దాదాపు 11.86 శాతం క్షీణతను చవి చూసింది. ఈ ? భారతదేశ ఆర్థిక సవాళ్లు కేవలం అంతర్జాతీయంగా డాలర్ బలోపేతం కావడం వల్లనో లేదా పశ్చిమాసియా సంక్షోభం కారణంగానో మాత్రమే జరగడం లేదు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని దేశీయ విధానాలు, ఆర్థిక నిర్వహణలో ఉన్న ప్రాథమిక లోపాలను ఈ



గణాంకాలు ఎత్తిచూపుతున్నాయి. భారతీయ రూపాయి 2025లో ఆసియాలోనే అత్యంత అధ్వాన్నమైన ప్రదర్శన కనబరిచిన కరెన్సీగా నిలిచింది. ప్రస్తుత సంవత్సరంలో కూడా అదే పరిస్థితిని కొనసాగిస్తోంది. ఇదే కాలంలో బంగ్లాదేశ్ టాకాతో పోలిస్తే కూడా భారత రూపాయి బలహీనపడింది. రూపాయికి 1.42 టాకాలుగా ఉన్న రేటు 1.28 టాకాలకు పడిపోయింది. ఇది ఈ సంవత్సరంలో దాదాపు 10 శాతం పతనానికి సమానం. ముడి చమురు ధరలు, విదేశీ మూలధనం నిరంతరాయంగా బయటకు తరలిపోవడం, అంతర్జాతీయ ఉద్రిక్తతల వల్ల మంగళవారం భారతీయ రూపాయి మరోసారి చారిత్రాత్మక కనిష్టానికి పతనమయ్యింది. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో డాలర్‌తో పోలిస్తే రూపాయి ఒకేరోజు 32 పైసలు క్షీణించి 96.52 వద్ద ముగిసింది. అంతకుముందు సోమవారం ఇది 96.20 వద్ద ముగిసిన సంగతి తెలిసిందే. ట్రేడింగ్ ముగిసే సమయానికి కొంత కోలుకున్నప్పటికీ.. ఇంట్రాడే ట్రేడింగ్‌లో రూపాయి ఎన్నడూ లేని విధంగా 96.60 మార్కును తాకింది. ఈ పతనంతో 2026 సంవత్సరంలో ఆసియాలోనే అత్యంత అధ్వాన్నమైన ప్రదర్శన కనబరిచిన కరెన్సీగా రూపాయి నిలిచింది. కేవలం ఈ నెలలోనే 1.5 శాతం, ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఏకంగా 7 శాతం కంటే ఎక్కువ విలువను కోల్పోయింది. ?

# కదులుతున్న కారులో
# మహిళా లాయర్‌పై అఘాయిత్యం

### మహారాష్ట్రలోని పుణేలో దారుణం

పుణే:మే 19 (నేటి దర్శిని)
బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలకు రక్షణ అనేది లేకుండా పోయింది. సామాన్యులపైనే కాదు మహిళా లాయర్లపై దుండగులు బరితెగి స్తున్నారు. తాజాగా మహారాష్ట్ర లోని పుణే లో దారుణ ఘటన చోటుచేసుకుంది. కదులుతున్న కారులో తనపై అత్యాచారం జరిగిందంటూ ఓ మహిళా లాయర్ ఆరోపించారు. ఈ ఘటనపై ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ముగ్గురిని అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..



పాట్నాకు చెందిన మహిళా లాయర్ ఓ పని మీద ఆదివారం పుణేకు వచ్చారు. అక్కడే ఓ ఫైవ్‌స్టార్ హోటల్‌లో బస చేశారు. హోటల్‌లోని పబ్‌లో మద్యం తాగుతుండగా.. పక్కనే ఉన్న ఇద్దరు వ్యక్తులతో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో వారంతా మరో పబ్‌కి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. తెల్లవారుజామున 1:30 గంటల సమయంలో కారులో వెళ్తుండగా.. వారిలో ఓ వ్యక్తి తనపై అత్యాచారం చేశాడని మహిళా న్యాయవాది ఆరోపించారు. ఆ తర్వాత వారు మరో ఇద్దరిని అక్కడికి పిలిచారని.. వారు కూడా తనను లైంగిక వేధింపులకు గురిచేశారని తెలిపారు. కాగా.. మహిళా లాయర్ ఫిర్యాదు మేరకు అఘాయిత్యం, లైంగిక వేధింపుల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. కారు నంబరు ఆధారంగా ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారిని అభిషేక్ నవనాథ్ ముక్తే, ధనుంజయ్ సోర్టే, ఆదేశ్ శిందేలుగా గుర్తించారు. నాలుగో నిందితుడి కోసం గాలింపు

# మళ్లీ పెట్రోల్, డీజిల్ బాదుడు

### లీటరుకు 90పైసలు పెంపు

న్యూఢిల్లీ మే 19 (నేటి దర్శిని)
కేవలం ఐదు రోజుల వ్యవధిలోనే పెట్రోల్, డీజిల్ ధరలు మంగళవారం మరోసారి పెరిగాయి. ఈ పెంపు తక్షణమే అమల్లోకి వచ్చింది. దేశవ్యాప్తంగా అన్ని వేరియంట్లకూ లీటరుకు 90పైసలు చొప్పున పెంచారు. నాలుగేండ్ల విరామం తర్వాత ఈ నెల 15న లీటరుకు రూ.3 పెరిగినప్పటి నుంచి తాజా పెంపును కూడా కలుపుకుంటే మొత్తంగా రెండు ఇంధనాల రిటైల్ ధరలు రూ.3.90 చొప్పున పెరిగాయి. పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ



దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలు, ప్రజలు ఆందోళనలు చేస్తున్నా... పట్టించుకోకుండా ధరలను వరుసగా పెంచుకుం టూ పోవడంపై ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాన నగరాలైన ఢిల్లీ, ముంబయి, చెన్నైలతో పోల్చుకుంటే కోల్‌కతాలో వీటి ధరలు బాగా పెరిగాయి. కోల్‌కతాలో పెట్రోల్ 96పైసలు పెరిగి లీటరు రూ.109.70కి చేరుకుంది. డీజిల్ 94పైసలు పెరిగి లీటరు రూ.96.07కి చేరింది. తాజా పెంపుతో ఢిల్లీలో ప్రస్తుతం లీటరు పెట్రోల్ ధర రూ.98.64గా వుండగా, డీజిల్ 91పైసలు పెరిగి లీటరు రూ.91.58కి చేరుకుంది. ముంబయిలో 91పైసలు పెరిగి లీటరు పెట్రోల్ రూ.107.59కి చేరుకోగా, డీజిల్ 94పైసలు పెరిగి రూ.94.08కి చేరింది. చెన్నైలో వరుసగా పెట్రో, డీజిల్ ధరలు లీటరుకు రూ.104.49, రూ.96.11గా వున్నాయి. ఈ నగరంలో పెట్రోల్ లీటరుకు 82పైసలే పెరగగా, డీజిల్ 86పైసలు పెరిగింది. ఇంక ఇతర మెట్రో నగరాల్లో దాదాపుగా 90పైసలే పెరిగింది.

## సెంట్రింగ్ కార్మికుల సంక్షేమం పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి

● ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి




**బి.యన్.రెడ్డి నగర్, మే19 (నేటి దర్శిని):** సెంట్రింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళ వారం బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ పరిధిలోని టీచర్స్ కాలనీ నందు సెంట్రింగ్ కాంట్రాక్టర్ అసోసియేషన్ నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, కార్మికులకు భద్రతా పరికరాలు అందించాలని, పని సమయంలో ప్రమాదాలకు గురైన వారికి తగిన నష్టపరిహారం కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు నిర్మాణ రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న సెంట్రింగ్ కార్మికుల సంక్షేమం పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మీయొక్క కష్ట సుఖాలల్లో తోడుగా ఉంటా,మీరందరూ క్రమశిక్షణగా ఉండి ఓపికతో పోరాటం చేయండి మీతో పాటు పోరాడుతా అని అన్నారు.అనంతరం పలువురి సభ్యులకు సుధీర్ రెడ్డి లేబర్ కార్డులు అందజేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ బారాస పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, ఉద్యమకారులు మాధవరం నరసింహారావు,మల్లేష్ గౌడ్, అధ్యక్షులు నర్సింహా,ఉపాధక్షులు రాఘవేంద్ర,ప్రధాన కార్యదర్శి గోవింద్,కార్యదర్శి అంజి, కోశాధికారి ఆంజనేయులు పలువురు కార్మిక సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఎల్బీ నగర్ నూతన జోనల్ కమిషనర్ వికాస్ మహాతోకు మాజీ కార్పొరేటర్ లచ్చి రెడ్డి శుభాకాంక్షలు

● ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జోనల్ కమిషనర్‌ను కోరిన మొద్దు లచ్చి రెడ్డి




**బి.ఎన్.రెడ్డి నగర్, మే 19 (నేటి దర్శిని):** ఎల్బీ నగర్ నూతన జోనల్ కమిషనర్గా బాధ్యతలు స్వీకరించిన శ్రీ వికాస్ మహాతో ఐఏఎస్ ని జీహెచ్ఎంసీ కార్యాలయంలో బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా వికాస్ మహాతోకు శుభాకాంక్షలు తెలియజేసిన లచ్చి రెడ్డి, జోన్ పరిధిలో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. ముఖ్యంగా బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుద్ధ్యం, రహదారుల మెరుగుదల వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ పారదర్శక పరిపాలన అందించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కర్మన్ ఘాట్ లో భాగ్యలక్ష్మి బేకర్స్ ఘనంగా ప్రారంభం



**కర్మన్ ఘాట్, మే19(నేటి దర్శిని):** ఎల్బీనగర్ నియోజకవర్గం కర్మన్ ఘాట్ లోని బజాజ్ ఎలక్ట్రానిక్స్ ఎదురుగా బాలాజీ ధాబా పక్కన నిర్వాహకులు మహేష్ భాటి,వివేక్ భాటి లు నూతనంగా ఏర్పాటు చేసిన భాగ్యలక్ష్మి బేకర్స్ (ప్యూర్ వెజ్ )ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హాజరై చైతన్య పురి డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు తోట మహేష్ యాదవ్ తో కలిసి మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, కర్మన్ ఘాట్ లాంటి ప్రాంతంలో ఇలాంటి బేకరి ని ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన కేకులు బిస్కెట్లు స్నాక్స్ అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయం అన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ఇలాంటి వ్యాపారాలు ముందుకు రావాలని సూచించారు.ప్రజల అభిరుచులకు అనుగుణంగా తాజా రుచికరమైన బేకరీ ఉత్పత్తులను సరసమైన ధరలకు అందించాలని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో మితురామ్ భాటి, సునిల్, స్థానిక నాయకులు, కాలనీ వాసులు, బంధుమిత్రులు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పుచ్చల పల్లి సుందరయ్య వర్ధంతి

**నిడమనూరు, మే19 (నేటి దర్శిని):** నిడమనూరు మండల కేంద్రంలో దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, ఆదర్శ నాయకులు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతిని సిపిఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులకు కొండేటి శ్రీను మండల కార్యదర్శి కందుకూరు కోటేష్ మాట్లాడుతూ ఆదర్శవంతమైన విలువలతో రాజకీయాలు చేయడం కమ్యూనిస్టులకే సాధ్యమని దీనికి సుందరయ్య జీవితమే ఆదర్శమని అన్నారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టినప్పటికీ భూస్వామ్య పెత్తందారి విధానాలకు వ్యతిరేకంగా చిన్ననాటి నుండే పోరాటం చేసిన మహా నాయకుడిని అన్నారు. తెలంగాణలో భూస్వామ్య జమీందారీ రజాకార్లకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటం సాగించడంలో కీలకపాత్ర వహించారని, వ్యవసాయ కార్మికులకు కూలీ పెరగాలని, భూమి పంచాలని సంఘం సంఘం పెట్టి కూలి భూమి పోరాటాలు చేశారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం



మండల కమిటీ సభ్యులు,కోమండ్ల గురువయ్య, నల్లబోతు సోమయ్య, మల్లికంటి చంద్రశేఖర్, ఆకారపు నరేష్, వెంపటి మహేష్, ఇంజమూరి శివ, కుంచెం శేఖర్, ముత్యాల కేశవులు, కోదండ చరణ్ రాజు, గుప్త శ్రీనివాస్ రెడ్డి,నడ్డి నాగరాజు, బొడ్డు లింగయ్య, వెంకటమ్మ సాంబయ్య మేరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన పెట్రోల్ డీజిల్ రేట్లను వెంటనే తగ్గించాలి: సీపీఎం

**నిడమనూరు, మే19 (నేటి దర్శిని):** పేద ప్రజలపై భారాలు మోపే పెట్రోల్ డీజిల్ రేట్లను వెంటనే తగ్గించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను మండల కార్యదర్శి కందుకూరి కోటేశ్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నిడమనూరు మండల కేంద్రంలో పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో పెంచిన డీజిల్ పెట్రోల్ ధరలకు నిరసనగా ఆటో లాగుతూ నిరసన తెలియజేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నింటి ధరలను విపరీతంగా పెంచి పేద ప్రజలపై భారతం అవుతుందని, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ వ్యక్తులకు అనుకూలమైనటువంటి నిర్ణయాలు చేస్తున్నారని



అన్నారు గ్యాస్ కొరత ప్రజలను వేధిస్తుంటే, అన్నీ ధరలను పెంచి, ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పి ప్రభుత్వం క్రమంగా పరిపాలనా బాధ్యతలను వదిలేసి, పార్టీని పెంచుకోవడంలోనే దృష్టి పెట్టిందని అన్నారు. పాలన చేతకాక దేశ ప్రజలకు పొదుపు సూక్తులు వల్లిస్తున్నారని అన్నారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించకపోతే దేశ ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు కోమాండ్ల గురువయ్య, నల్లబోతు సోమయ్య, ఆకారపు నరేష్, మలికంటి చంద్రశేఖర్, వెంపటి మహేష్, కొంచెం శేఖర్, కోదండ చరణ్ రాజ్, వింజమూరి శివ, తదితరులు పాల్గొన్నారు

## మిడ్జిల్ మాజీ సర్పంచ్ బరిగెల శారద వెంకటయ్య దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు



● తెలిపిన అభిమానులు, కాంగ్రెస్ మండల నాయకులు



**మిడ్జిల్, మే 19, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** మిడ్జిల్ గ్రామ సర్పంచ్ మాజీ సర్పంచ్ బరిగెల శారద వెంకటయ్యదంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేసిన మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....మీరిద్దరూ కలసి సాగిస్తున్న ఈ అందమైన జీవిత ప్రయాణం ప్రేమ, పరస్పర గౌరవం, అర్థం చేసుకునే మనసుతో మరింత ఆనందంగా, సార్థకంగా కొనసాగాలని ఆకాంక్షిస్తున్నాం.ప్రతి సంవత్సరం మీ బంధం మరింత బలపడుతూ, నవ్వులు, సంతోషాలు నిండిన రోజులను అందించాలని కోరుకుంటున్నాం. మీ కుటుంబంలో ఎల్లప్పుడూ ఆనందం, ఐశ్వర్యం వెల్లివిరియాలి. మీరు ఇలాగే అనేక విజయాలను అందుకుని, ఇతరులకు ఆదర్శంగా నిలవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ... వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేసిన మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు కార్యకర్తలు అభిమానులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## సన్ షైన్ విద్యార్థులను సన్మానించిన ఎమ్మెల్యే

**చండూర్, మే19(నేటి దర్శిని):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన పదవ తరగతి ఫలితాల్లో మండల 2వ, 3వ మరియు 5వ ర్యాంకులు సాధించిన మున్సిపాలిటీ కేంద్రంలోని సన్ షైన్ హై స్కూల్ విద్యార్థులను మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, హైదరాబాదులోని వారి కార్యాలయానికి ఆహ్వానించి మండల 2వ ర్యాంకు సాధించిన చెరుపల్లి శృతి, మండల 3వ ర్యాంకు సాధించిన చెదురువెల్లి హాసిని,మండల 5వ ర్యాంక్ సాధించిన రావిరాల వైష్ణవి లను శాలువాలు కప్పి మెమోంటోలను అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి, మాట్లాడుతూ విద్యార్థులు చదువులో అత్యున్నత స్థానాలను పొందాలని తద్వారా జన్మనిచ్చిన తల్లిదండ్రులకు విద్యాబుద్ధులు నేర్పించిన పాఠశాలకు మరియు పట్టణానికి మంచి పేరు తీసుకురావాలని చదువులో ఇదేవిధంగా ముందుకు సాగుతూ మునుగోడు నియోజకవర్గానికి ప్రత్యేక స్థానాన్నీ కల్పించాలని ఆశించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కోడి వెంకన్న,



మాట్లాడుతూ మా సన్ షైన్ పాఠశాల విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో ముందుంటారని తద్వారా జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఆశించారు.

# ప్రభుత్వ పార్క్ భూమి కబ్జా

- అడ్డగుట్టలో అక్రమ నిర్మాణం జోరుగా సాగుతున్నా అధికారుల మౌనం
- ఫిర్యాదులు చేసినా స్పందన శూన్యం
- జిహెచ్ఎంసి, రెవెన్యూ అధికారులపై స్థానికుల తీవ్ర ఆరోపణలు



**సికింద్రాబాద్,మే19 (నేటి దర్శని):** ప్రభుత్వ భూములు, పార్క్ స్థలాలు ప్రజల కోసం కేటాయిస్తే, వాటిని కాపాడాల్సిన అధికారులే కళ్లు మూసుకుంటే పరిస్థితి ఎలా ఉంటుందో అడ్డగుట్ట డివిజన్‌లో జరుగుతున్న ఘటన చూస్తే అర్థమవుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. అడ్డగుట్ట డివిజన్ పరిధిలోని సర్వే నెంబర్ 74/6లో ప్రభుత్వానికి చెందిన పార్క్ స్థలాన్ని కబ్జా చేసి భారీగా అక్రమ నిర్మాణం కొనసాగుతుండటంపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే నిర్మాణ పనులు బహిరంగంగా సాగుతున్నప్పటికీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం, పార్క్ కోసం కేటాయించిన స్థలంలో కొంతకాలంగా దశలవారీగా ఆక్రమణలు ప్రారంభమయ్యాయని, ఇటీవల వాటిని మరింత విస్తరించి భారీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారని పేర్కొంటున్నారు. నగరంలో చాలావరకు జిహెచ్ఎంసి అనుమతులు లేకుండానే కాంక్రీట్ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నప్పటికీ సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది ఇప్పటివరకు ఒక్క నోటీసు కూడా ఇవ్వలేదని మండిపడుతున్నారు.

**ఫిర్యాదులు చేస్తే ఫైళ్లలోనే పాతిపెడుతున్నారు**

అక్రమ నిర్మాణంపై ఇప్పటికే జిహెచ్ఎంసి సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ కార్యాలయానికి పలుమార్లు ఫిర్యాదులు అందాయని స్థానికులు చెబుతున్నారు. ఫోటోలు, వీడియోలతో సహా పూర్తి ఆధారాలు ఇచ్చినా అధికారులు మాత్రం అసలు స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. సాధారణ ప్రజలు చిన్న షెడ్ వేసినా వెంటనే కూల్చివేతలు చేసే అధికారులు, ఇక్కడ ప్రభుత్వ పార్క్ స్థలం కొంత భాగం కబ్జా చేసి భారీ నిర్మాణం జరుగుతున్నా ఎందుకు మౌనంగా ఉన్నారు. అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇక రెవెన్యూ శాఖ అధికారుల వ్యవహారంపై కూడా తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ భూములను రక్షించాల్సిన బాధ్యత ఉన్న అధికారులు ఆక్రమణదారుల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని, ఈ వ్యవహారంలో లోపాయికారీ ఒప్పందాలు ఉన్నాయా.? అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

**ఏసీబీకి ఫిర్యాదు.. అయిన పనులు ఆగలేదు**

సికింద్రాబాద్ జోన్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాల వ్యవహారంపై ఏసీబీ అధికారులకు, ముఖ్యంగా జోనల్, డిప్యూటీ కమిషనర్లకు కూడా ఫిర్యాదు అందినట్లు సమాచారం. అయినప్పటికీ నిర్మాణ పనులు యథావిధిగా కొనసాగుతుండటంతో ప్రజల్లో మరింత అనుమానాలు పెరుగుతున్నాయి. ఫిర్యాదులు వెళ్లినా చర్యలు లేకపోవడం వెనుక రాజకీయ, ఆర్థిక ఒత్తిళ్లు ఉన్నాయా.? అనే చర్చ స్థానికంగా జరుగుతోంది.

**అధికారులను బెదిరిస్తునారా.?**


ఇంకా సంచలన విషయం ఏమిటంటే, అక్రమ నిర్మాణం వద్దకు వెళ్లిన జిహెచ్ఎంసి అధికారులను సదరు నిర్మాణదారుడు బెదిరింపులకు గురి చేస్తున్నాడని మున్సిపల్ సిబ్బంది, స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనితో అధికారులు కూడా చర్యలు తీసుకోవడానికి వెనుకంజ వేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులే భయపడే పరిస్థితి ఏర్పడితే సామాన్య ప్రజలకు రక్షణ ఎక్కడ అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**ప్రభుత్వ భూములు కాపాడలేకపోతే ప్రజలకు న్యాయం ఎలా.?**

సికింద్రాబాద్ నియోజకవర్గంలో పార్క్ స్థలాలు ప్రజల ఆరోగ్యం, పిల్లల ఆటస్థలాల కోసం కేటాయిస్తే అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ వాటిని అక్రమ నిర్మాణాలకు వదిలేయడం దారుణమని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అక్రమ నిర్మాణాన్ని నిలిపివేసి, ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని, బాధ్యులైన పార్కు స్థలం కబ్జా దారునిపై, అధికారులపై కూడా విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులు కబ్జాలకు గురవుతుంటే చూస్తూ ఊరుకునే అధికారుల వైఖరి ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి దారితీస్తోంది. ఇప్పటికైనా సికింద్రాబాద్ జోన్ ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకుంటారా.? లేక అక్రమార్కులకే అధికార వ్యవస్థ తలవంచుతుందా.? అనే ప్రశ్నలు ప్రజల్లో తీవ్రంగా వినిపిస్తున్నాయి.

# గుర్రంపోడ్ లో 108 సేవలు అమోఘం..

- సిబ్బంది పనితీరుపై అధికారుల ప్రశంసలు



**గుర్రంపోడు మే 19 (నేటి దర్శిని):** నల్గొండ జిల్లా 108 సేవల జిల్లా మేనేజర్ ప్రదీప్ గుర్రంపోడు 108 అంబులెన్స్‌ను సందర్శించి అందులోని అత్యాధునిక పరికరాల పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అంబులెన్స్‌లో అన్ని సౌకర్యాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అంబులెన్స్‌లో ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డీఫిబ్రిలేటర్, అంబు బ్యాగ్, గ్లూకోమీటర్ తదితర ఆధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో నిర్భయంగా 108 సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాల ప్రోగ్రాం మేనేజర్ సలీమ్ మాట్లాడుతూ అంబులెన్స్‌లో అన్ని రకాల అత్యవసర మందులు, గ్లూకోజ్‌లు, వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా వేసవి కాలంలో వడదెబ్బ బాధితుల కోసం కూల్ ప్యాడ్స్, టవల్స్ వంటి ప్రత్యేక సదుపాయాలు కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రోడ్డు ప్రమాదాల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ, వారి సేవలను అధికారులు అభినందించారు. గత మూడు నెలల కాలంలో గుర్రంపోడు 108 అంబులెన్స్ ద్వారా 130 గర్భిణీ కేసులు, 145 మెడికల్ కేసులు, 55 రోడ్డు ప్రమాద కేసులు, 20 విషప్రయోగ కేసులు సహా మొత్తం 350 కేసులను ఆస్పత్రులకు తరలించి అనేక మంది ప్రాణాలను కాపాడినట్లు జిల్లా మేనేజర్ ప్రదీప్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆన్ డ్యూటీ సిబ్బంది ఈఎంటీలు గిరి, సత్యనారాయణ, పైలట్లు వెంకట్, శివాజీ పాల్గొన్నారు. వీరు 24 గంటల పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

# మల్లాపూర్ డివిజన్ లో తాగునీటి సమస్య పై సమీక్ష సమావేశం...



**నాగారం, మే19:-(నేటి దర్శిని):** ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి ఆలోచన మేరకు మల్లాపూర్ డివిజన్‌లోని పలు కాలనీలలో నెలకొన్న తాగునీటి సమస్యల పరిష్కారం కోసం గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ జలమండలి జనరల్ మేనేజర్(జిఎం) సంతోష్ కుమార్ తో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీజీఎం వేణుగోపాల్, మల్లాపూర్ ఎఈ రోహిత్ కూడా ఈ సమావేశం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ మల్లాపూర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల ప్రజలు తాగునీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా వేసవి కాలంలో నీటి సరఫరా సక్రమంగా లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. డివిజన్‌లో తాగునీటి సరఫరాను మెరుగుపరచడంతో పాటు, నీటి సమస్యలు అధికంగా ఉన్న ప్రాంతాలలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని జలమండలి అధికారులను కోరారు. దీనిపై స్పందించిన అధికారులు సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ఎం ఎం సి మున్సిపల్ కార్పొరేషన్‌లో అవుట్సోర్సింగ్ ఉద్యోగుల ఆవేదన


- ఏప్రిల్ జీతాలు ఇంకా ఇవ్వలేదు..

ఆకలితో అలమటిస్తున్న కార్మిక కుటుంబాలు

**మల్కాజిగిరి,మే19 (నేటి దర్శిని):** అసలే తక్కువ జీతాలు సరిపోవట్లేదు అవి కూడా 1వ తేదీన ఇవ్వక ఉద్యోగులను వీధిన పడేస్తున్న అధికారులు అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నెల కిరాయిలు, పిల్లల ఫీజులు, అప్పుల ఒత్తిడితో కార్మికుల జీవితాలు చితికిపోతున్న వైనం

ఎం ఎం సి మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న అవుట్సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా మారింది. ఇప్పటికే అతి తక్కువ వేతనాలతో కుటుంబాలను పోషించుకుంటున్న కార్మికులకు ఇప్పటికీ ఏప్రిల్ నెల జీతాలు ఇప్పటికి అందకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నెలలు గడుస్తున్నా జీతాలపై అధికారులు స్పష్టత ఇవ్వకపోవడం కార్మికుల్లో ఆందోళన, అయోమయాన్ని మరింత పెంచుతోంది. పగలు రాత్రి తేడా లేకుండా నగర పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణ, కార్యాలయ సేవలు, ఫీల్డ్ పనులు నిర్వహిస్తూ మున్సిపల్ వ్యవస్థను నడిపిస్తున్న అవుట్సోర్సింగ్ ఉద్యోగుల పట్ల అధికారుల నిర్లక్ష్యం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. పని మాత్రం ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే చేయించుకుంటూ జీతాలు మాత్రం సమయానికి ఇవ్వకపోవడం దారుణమని





ఉద్యోగులు మండిపడుతున్నారు.ఇప్పటికే పెరిగిన ధరలు, ఇంటి ఖర్చులు, పిల్లల చదువులు, వైద్య ఖర్చులతో అవుట్సోర్సింగ్ సిబ్బంది సతమతమవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నెల జీతం కూడా అందకపోవడంతో అనేక కుటుంబాలు అప్పుల బారిన పడుతున్నాయి. కొంతమంది ఉద్యోగులు ఇల్లు కిరాయిలు కట్టలేక ఇల్లు యజమానుల ఒత్తిడిని ఎదుర్కొంటుండగా, మరికొందరు పిల్లల స్కూల్ ఫీజులు చెల్లించలేక అవమానాలు పడుతున్నారు. చేతిలో రూపాయి లేక భోజనానికి కూడా ఇబ్బంది పడుతున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పని చేయించుకోవడంలో అధికారులు ముందుంటారు. కానీ జీతాలు ఇవ్వడంలో మాత్రం బాధ్యత తీసుకోరు. నెల మొత్తం కష్టపడి పనిచేసినా జీతం ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. బ్యాంక్ లోన్స్, చిట్టీలు, ఇంటి కిరాయిలు అన్నీ పెండింగ్‌లో ఉన్నాయి, అంటూ పలువురు అవుట్సోర్సింగ్ ఉద్యోగులు వాపోతున్నారు.

కార్మికుల చెమటతో నడుస్తున్న మున్సిపల్ వ్యవస్థలో వారిని ఇంతలా నిర్లక్ష్యం చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రజా సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. కోట్ల రూపాయల బడ్జెట్లు, భారీ ప్రాజెక్టులు, అధికారుల హంగామా మధ్య నిజంగా కష్టపడే కార్మికులకు మాత్రం కనీస వేతనం కూడా సమయానికి ఇవ్వలేని పరిస్థితి ఎందుకు వచ్చిందని మండిపడుతున్నారు.జీతాల ఆలస్యానికి కారణాలేమిటో స్పష్టంగా చెప్పకుండా అధికారులు కాలయాపన చేయడం పట్ల ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. అవుట్సోర్సింగ్ సిబ్బంది సమస్యలను పట్టించుకోకపోతే రాబోయే రోజుల్లో ఆందోళనలు తీవ్రరూపం దాల్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం, మున్సిపల్ కమిషనర్లు, ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న ఏప్రిల్ నెల జీతాలను వెంటనే విడుదల చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. కష్టపడి పనిచేసే కార్మికుల కుటుంబాలు ఆకలితో అలమటించే పరిస్థితి రావడం ప్రభుత్వ యంత్రాంగానికి మచ్చగా మారుతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# ధాన్యం దిగుమతి వేగంగా పూర్తి చేయాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్.



**మంచిర్యాల జిల్లా , మే 19 (నేటి దర్శిని):** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేసి గోదాములు, రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని, ఈ క్రమంలో ధాన్యం దిగుమతి వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని జైపూర్ మండలం ఇందారంలో గల సుముఖ గోదాము, జయలక్ష్మి రైస్ మిల్ లను మండల తహసిల్దార్ వనజా రెడ్డి తో కలిసి సందర్శించి ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం మద్దతు ధర చెల్లించి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని, అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా గోదాములు, రైస్ మిల్లులకు కేటాయించిన ప్రకారం తరలించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో లారీల నుండి ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకోవాలని, అవసరం మేరకు హమాలీల సంఖ్యను పెంపొందించుకోవాలని, రోజుకు 10 నుండి 15 లారీలు దిగుమతి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైస్ మిల్లర్లు సి ఎం ఆర్ ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని, కేటాయించిన లక్ష్యాలను నిర్దేశిత సమయంలోగా పూర్తి చేసే విధంగా అధికారుల సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు, పాల్గొన్నారు.

# గో సంరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

- షాద్ నగర్ పట్టణానికి చెందిన జి.శ్రీనివాస్ రెడ్డి
- గో సంరక్షణకు ఒక ట్రాక్టర్ వరిగడ్డి కట్టలు అందజేత



**షాద్ నగర్, మే19(నేటి దర్శిని):** గో సంరక్షణకు ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని, గోవులను పూజిస్తే సకల శుభాలు కలుగుతాయి అని షాద్ నగర్ పట్టణానికి చెందిన జి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. చౌడమ్మగుట్ట శ్రీకృష్ణ గోశాలకు ట్రాక్టర్ లోడ్ గడ్డి కట్టలు దానం చేశారు. గోవుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని వాటి ఆకలి తీర్చేందుకు పశుగ్రాసం అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పశువులకు గడ్డి దానం చేసిన జి శ్రీనివాస్ రెడ్డి కు దేవాలయం కమిటీ మాజీ సర్పంచ్ పులిమామిడి శ్రీశైలం గౌడ్, వారికి ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో, .మాజీ వార్డు సభ్యులు సింగపాగ లక్ష్మయ్య తదిరులున్నారు.

# బిజినెస్

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్..

- సెన్సెక్స్ 114 పాయింట్లు పతనం..
- మరింత పడిపోయిన రూపాయి




భారత స్టాక్ మార్కెట్ మంగళవారం నష్టాల్లో ముగిసింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 114.19 పాయింట్ల నష్టంతో 75,200.85 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 75,746.27 పాయింట్ల గరిష్టాన్ని తాకినప్పటికీ.. మధ్యాహ్నం నుంచి పతనమైంది. చివరికి స్వల్ప నష్టాల్లో ముగిసింది. ఇక ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 31.95 పాయింట్ల నష్టంతో 23,618 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో భారతీ ఎయిర్‌టెల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, టైటాన్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎల్ అండ్ టీ, బజాజ్ ఫిన్‌సర్వ్, సన్ ఫార్మా షేర్లు నష్టాలు చవిచూశాయి. టీసీఎస్, ఎటర్నల్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ సంస్థలు లాభాలు పొందాయి. ఉదయం ట్రేడింగ్ లాభాల్లో ప్రారంభమైనప్పటికీ.. మధ్యాహ్నం నుంచి నష్టాల్లో కొనసాగాయి. ఇరాన్‌తో అణు ఒప్పందం కుదుర్చుకుంటామని ట్రంప్ వెల్లడించడం మార్కెట్ వర్గాలకు కాస్త ఉపశమనం కలిగించింది. మరోవైపు ఈ రోజు అంతర్జాతీయంగా చమురు ధర 2 శాతానికిపైగా, 2 డాలర్ల వరకు తగ్గింది. బ్యారెల్ క్రూడాయిల్ ధర 109 డాలర్ల నుంచి 107 డాలర్లకు పడిపోయింది. అయితే, ఈ ధర సాధారణం కంటే చాలా ఎక్కువ. మరోవైపు డాలర్‌తో రూపాయి విలువ పతనం కొనసాగుతోంది. ఒక దశలో డాలర్‌తో 96.61 వద్ద ఆల్‌టైమ్ కనిష్ట స్థాయికి పడిపోయిన రూపాయి.. తర్వాత కాస్త కోలుకుని 96.52 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా బంగారం ఔన్స్ ధర 4540 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## పసిడి ప్రియులకు షాక్..

### భారీగా పెరిగిన బంగారం ధరలు..

**ఇంటర్‌నెట్ డెస్క్**

పసిడి ప్రియులకు బంగారం ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. నిన్నటి వరకు తగ్గుతూ వచ్చిన ధరలు నేడు భారీగా పెరిగాయి. మున్న (సోమవారం) హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం 1,56,220 రూపాయల వద్ద.. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం 1,43,200 రూపాయల వద్ద..10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం 1,17,170 రూపాయల వద్ద ట్రేడ్ అయింది. మంగళవారం బంగారం ధరలు పెరిగాయి. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై 820 రూపాయలు.. 22 క్యారెట్ల బంగారంపై 750 రూపాయలు.. 18 క్యారెట్ల బంగారంపై 610 రూపాయలు పెరిగింది. గుడ్ రిటర్న్స్ వెబ్ సైట్ ప్రకారం ఉదయం 10 గంటల ప్రాంతంలో హైదరాబాద్ మార్కెట్‌లో బంగారం ధరలు ఇలా ఉన్నాయి. 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ల



బంగారం 1,57,040 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం 1,43,950 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం 1,17,780 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది.

**ప్రముఖ నగరాల్లో 24 క్యారెట్ల బంగారం ధర ఇలా ( 10 గ్రాములు)**

హైదరాబాద్: రూ. 1,57,040
విజయవాడ: రూ. 1,57,040
విశాఖపట్నం: రూ. 1,57,040
ముంబై: రూ. 1,57,040
బెంగళూరు: రూ. 1,57,040
ఢిల్లీ: రూ. 1,57,190
చెన్నై: రూ. 1,62,220
సూరత్: రూ. 1,57,190
మధురై: రూ. 1,62,220
కోయంబత్తూరు: రూ. 1,62,220

గమనిక: బంగారం, వెండి ధరలు ఎప్పటికప్పుడు మారుతుంటాయి. కాబట్టి కొనుగోలు చేసే ముందు ఒకసారి ధరలను చెక్ చేసుకోవలసిందిగా సూచన.

## ఎయిర్‌టెల్‌ను దాటేసిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్..

**-మార్కెట్ విలువ పరంగా మళ్లీ రెండో స్థానానికి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు**
**-కిందటి రోజు షేరు పెరగడంతో రెండో స్థానంలో ఎయిర్ టెల్**
**-మే 19న ఎయిర్‌టెల్ షేర్లు పతనం**

భారత స్టాక్ మార్కెట్ సూచీలు కొంత కాలంగా తీవ్ర ఒడుదొడుకుల్లో ట్రేడవుతున్న సంగతి తెలిసిందే. పశ్చిమాసియా ఉద్రిక్తతలు సహా ఇతర అంశాలు సూచీల్ని ప్రభావితం చేస్తున్నాయి. మార్చి నెలలో సూచీలు భారీగా పతనం కాగా.. గత కొద్ది రోజులుగా మాత్రం రాణిస్తున్నాయి. కిందటి రోజు భారీ నష్టాల నుంచి కోలుకొని స్వల్ప లాభాలు నమోదు చేయగా.. భారతీ ఎయిర్‌టెల్ షేరు కూడా భారీగా పుంజుకుంది. గత 3 సెషన్లుగా ఈ స్టాక్ రాణించగా.. మార్కెట్ విలువను భారీగా పెంచుకుంది కూడా. ఈ క్రమంలోనే భారత్‌లో మార్కెట్ విలువ పరంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ తర్వాత రెండో అతిపెద్ద కంపెనీగా నిలిచింది. భారత అతిపెద్ద ప్రైవేట్ బ్యాంక్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మూడో స్థానానికి దిగజారింది. మే 18న ఇంట్రాడేలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మార్కెట్ విలువ రూ. 11.80 లక్షల కోట్లకు పడిపోగా.. మరోవైపు భారతీ ఎయిర్‌టెల్ ఎం క్యాప్ రూ. 11.90 లక్షల కోట్లకు చేరి రెండో స్థానానికి చేరింది. అయితే.. మే 19న (మంగళవారం) పరిస్థితి మారిపోయింది. భారత స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం సెషన్‌లో మళ్లీ నష్టాల్ని నమోదు చేశాయి. సెన్సెక్స్ 114 పాయింట్లు పడిపోగా.. మరోవైపు నిఫ్టీ 32 పాయింట్లు తగ్గింది. ఐటీ స్టాక్స్ రాణించినప్పటికీ.. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎయిర్‌టెల్, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, డీమార్ట్, ఇండిగో, టాటా స్టీల్ సహా ఇతర బ్యాంకింగ్ స్టాక్స్ నష్టపోయాయి.

# స్పోర్ట్స్

## ఆఫ్ఘనిస్తాన్ వన్డే సిరీస్‌కు భారత జట్టు ప్రకటన

### జట్టులోకి హర్ష్ దూబె, గుర్నూర్ బ్రార్, ప్రిన్స్ యాదవ్

ఐపీఎల్ 2026 ఫీవర్ ముగిసేలోపే టీమ్ఇండియా మళ్లీ ఇంటర్నేషనల్ క్రికెట్ మోడ్‌లోకి ఎంటర్ కానుంది. మే 31న ఐపీఎల్ ఫైనల్‌తో మెగా టోర్నీ ముగియనుండగా.. వెంటనే జూన్‌లో అఫ్గానిస్థాన్‌తో కీలక సిరీస్‌కు భారత్ సిద్ధమవుతోంది. స్వదేశంలో జరగనున్న ఈ సిరీస్‌లో ఒక టెస్టు, మూడు వన్డేలు ఉండనున్నాయి. ఈ టూర్ కోసం భారత సీనియర్ సెలక్షన్ కమిటీ తాజాగా జట్లను ప్రకటించింది. ఈసారి జట్టులో యువ ఆటగాళ్లకు పెద్దపీట వేయడం విశేషం. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ కారణంగా విశ్రాంతి ఇచ్చారు. మరోవైపు వన్డే జట్టులో రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యలకు చోటు దక్కినా.. వారి ఎంపిక ఫిట్‌నెస్ క్లియరెన్స్‌పై ఆధారపడి ఉంటుందని సెలెక్టర్లు స్పష్టం చేశారు. చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ మాట్లాడుతూ.. మహ్మద్ షమి విషయంపై సెలక్షన్ కమిటీ చర్చించలేదని తెలిపారు. ఈ సిరీస్‌లో యువ క్రికెటర్లకు భారీ అవకాశం దక్కింది. హర్ష్ దూబె, గుర్నూర్ బ్రార్, ప్రిన్స్ యాదవ్ తొలిసారిగా భారత జట్టులో స్థానం సంపాదించారు.




ముఖ్యంగా ప్రిన్స్ యాదవ్ వన్డే జట్టులోనే చోటు దక్కించుకోవడం ఆసక్తికరంగా మారింది. టెస్టు జట్టుకు యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేశారు. వైస్ కెప్టెన్‌గా కేఎల్ రాహుల్ వ్యవహరించనున్నాడు. యశస్వి జైస్వాల్, సాయి సుదర్శన్, రిషభ్ పంత్, దేవ్‌దత్ పడిక్కల్ వంటి యువ ఆటగాళ్లతో జట్టు బలంగా కనిపిస్తోంది. బౌలింగ్ విభాగంలో మహ్మద్ సిరాజ్, కుల్‌దీప్ యాదవ్ కీలక బాధ్యతలు తీసుకోనున్నారు. వన్డే జట్టులో మాత్రం అనుభవం–యువత కలయిక కనిపిస్తోంది. కెప్టెన్‌గా మళ్లీ శుభ్‌మన్ గిల్‌కే బాధ్యతలు అప్పగించగా.. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, శ్రేయస్ అయ్యర్ వంటి సీనియర్ బ్యాటర్లు జట్టుకు బలం కానున్నారు. ఇషాన్ కిషన్ తిరిగి వన్డే సెటప్‌లో చోటు సంపాదించగా.. అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ వంటి పేసర్లు అఫ్గాన్ బ్యాటర్లకు సవాల్ విసరనున్నారు. అఫ్గాన్‌తో ఏకైక టెస్టుకు భారత జట్టు.. శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), సాయి సుదర్శన్, రిషభ్ పంత్, దేవ్‌దత్ పడిక్కల్, వాషింగ్టన్ సుందర్, మహ్మద్ సిరాజ్, కుల్‌దీప్ యాదవ్, నితీష్ కుమార్ రెడ్డి, మానవ్ సుతార్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, ధ్రువ్ జురెల్, హర్ష్ దూబె.

## ముంబైకి డబుల్ స్ట్రోక్.. ఐపీఎల్ నుంచి ఆ ఇద్దరు ఔట్..!


పేలవమైన ఆటతో ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన ముంబై ఇండియన్స్ కు డబుల్ స్ట్రోక్ తగిలింది. ఓపెనర్ క్వింటన్ డికాక్, ఆల్‌రౌండర్ రాజ్ అంగద్ బవా ఐపీఎల్ నుంచి వైదొలిగారు. గాయంతో బాధ పడుతున్న ఈ ఇద్దరూ మిగతా రెండు మ్యాచులకు దూరమయ్యారు. ఈ విషయాన్ని ముంబై ఫ్రాంచైజీ ఎక్స్ వేదికగా వెల్లడించింది. పంతొమ్మిదో సీజన్‌లో తీవ్రంగా నిరాశపరిచి.. 11 మ్యాచుల్లో 7 ఓటములతో ఎలిమేట్ అయిన ముంబై ఇండియన్స్ ఇద్దరు కీలక ఆటగాళ్ల సేవల్ని కోల్పోయింది. విధ్వంసక ఓపెనర్ క్వింటన్ డికాక్, పేస్ ఆల్‌రౌండర్ రాజ్ బవా గాయంతో అనూహ్యంగా టోర్నీ నుంచి నిష్క్రమించారు. సన్‌రైజర్స్‌తో మ్యాచ్‌కు ముందు నెట్స్‌లో డికాక్ గాయపడ్డాడు. అతడి ఎడమ చేతి మణికట్టు నరం దెబ్బతినడంతో ఇబ్బందిపడ్డాడు. రాజ్ బవా విషయానికొస్తే.. కుడి బొటనవేలు నరంలో చీలిక వచ్చింది. దాంతో.. ముంబై తదుపరి మ్యాచ్‌లకు వీరు అందుబాటులో ఉండడం లేదు. గాయం నుంచి




కోలుకునేందుకు డికాక్ స్వదేశం(దక్షిణాఫ్రికా) వెళ్లగా.. రాజ్ బవా ఛండీగఢ్ చేరుకున్నాడు. నాకౌట్ చేరని ముంబై పోతూపోతూ ఇతర జట్ల అవకాశాల్ని దెబ్బతీయనుంది. మే 20న కోల్‌కతా నైట్ రైడర్స్‌తో, మే 24న రాజస్థాన్ రాయల్స్‌తో తలపడనుంది.

## చెన్నైలో ఆస్ట్రేలియా టీ20 లీగ్..

### అధికారిక ప్రకటనే తరువాయి..!




ఐపీఎల్ సందడి ముగిసిన తర్వాత చెన్నై వేదికగా మరో టీ20 లీగ్ అభిమానులను అలరించనుంది. ఆస్ట్రేలియా గడ్డపై జరిగే బిగ్‌బాష్ లీగ్ ను తొలిసారి భారత గడ్డపై నిర్వహించనున్నారు. ఈమేరకు క్రికెట్ ఆస్ట్రేలియా, భారత క్రికెట్ నియంత్రణ మండలి , తమిళనాడు క్రికెట్ సంఘం మధ్య చర్చలు జరుగుతున్నాయి. త్వరలోనే ఈ మూడింటి మధ్య ఒక ఒప్పందం కుదరనుంది. చెన్నై చెపాక్ స్టేడియంలో డిసెంబర్ 12 బీబీఎల్ మ్యాచ్ ఆడిస్తారని సమాచారం. అయితే.. క్రికెట్ ఆస్ట్రేలియా, టీఎన్‌సీఏ అధికారిక ప్రకటన వెల్లడించాల్సి ఉంది. భారత్, ఆస్ట్రేలియా మధ్య కొన్ని కార్యక్రమాల మార్పిడి ఒప్పందం ఉంది. అందులో భాగంగానే ఇండియాలో బీబీఎల్ మ్యాచ్ నిర్వహణకు అడుగులు వేగంగా పడుతున్నాయి. చెన్నైలో వసతులు, పరిస్థితుల్ని స్వయంగా చూసి తెలుసుకునేందుకు క్రికెట్ ఆస్ట్రేలియా, బీబీఎల్ బృందం ఈ మధ్యే భారత్‌కు వచ్చింది. సోమవారం చిదంబరం స్టేడియంలో మ్యాచ్ నిర్వహణ, ప్రేక్షకుల ఆదరణ వంటి విషయాలను ఆ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మిన్హాస్, తాత్కాలిక సీఈఓ హేమంగ్ అమిన్‌లు సైతం హాజరయ్యారు. చెన్నైలో బీబీఎల్ మ్యాచ్ నిర్వహణపై క్రికెట్ ఆస్ట్రేలియా నుంచి రెండు వారాల్లో అధికారిక ప్రకటన వెలువడనుంది. సోమవారం చెపాక్‌లో సన్‌రైజర్స్, చెన్నై సూపర్ కింగ్స్ మ్యాచ్‌ను ఆ దేశ బోర్డు సభ్యులు, బీబీఎల్ బృందంతో పాటు వీక్షించారు. త్వరలోనే పూర్తి సమాచారంతో తిరిగొస్తామని వారు చెప్పారు. బీబీఎల్ మ్యాచ్ నిర్వహించడంలో మాకు ఇబ్బందేమీ లేదు. ఈ విషయంలో బీసీసీఐ ఆత్మవిశ్వాసంతో ఉంది. సో.. మేము తుది అనుమతులు కోసం ఎదురుచూస్తున్నాం' అని క్రిక్‌బజ్‌తో టీఎన్‌సీఏ అధికారి ఒకరు తెలిపారు. అన్నీ కుదిరితే డిసెంబర్ 12న చెపాక్‌లో బీబీఎల్ మ్యాచ్ జరుగనుందని విశ్వసనీయ సమాచారం.

# కురుప్పు వసూళ్ల సునామీ



కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, త్రిష జంటగా ఆర్జే బాలాజీ దర్శకత్వంలో తెరకెక్కిన మైథలాజికల్ యాక్షన్ డ్రామా 'కరుప్పు' బాక్సాఫీస్ వద్ద రికార్డుల వేట కొనసాగిస్తోంది. ఈ చిత్రం కేవలం 4 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.150 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసి సంచలనం సృష్టించింది. వారాంతంలోనే కాకుండా వర్కింగ్ డే అయిన సోమవారం కూడా ఈ సినిమా థియేటర్లలో భారీ వసూళ్లను సాధించింది. అడ్వాన్స్ బుకింగ్స్ కూడా ట్రెండీగా, చాలా స్టాం÷-రగ్‌గా ఉన్నాయి. ఈ జోరు చూస్తుంటే సూర్య సినీ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా 'కరుప్పు' నిలవడం ఖాయంగా కనిపిస్తోంది. పాత రికార్డులను తిరగరాస్తూ దూసుకుపోతున్న ఈ చిత్రం త్వరలోనే రూ.200 కోట్ల క్లబ్‌లో చేరే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# నేడు ఎన్టీఆర్ బర్త్‌డే

## అర్ధరాత్రికి డ్రాగన్ గ్లింప్స్ విడుదల




యంగ్ టైగర్ ఎన్టీఆర్, సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న మోస్ట్ అవైటెడ్ పాన్-ఇండియా చిత్రం నుంచి ఎట్టకేలకు ఒక భారీ అప్‌డేట్ వచ్చేసింది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ పుట్టినరోజు మే 20 పురస్కరించుకుని, మేకర్స్ అభిమానుల కోసం ఒక అద్భుతమైన సర్ప్రైజ్ ప్లాన్ చేశారు. ఈ రోజు అర్ధరాత్రి సరిగ్గా 11:52 గంటలకి ఈ చిత్రం యొక్క ఫస్ట్ గ్లింప్స్ డిజిటల్ ఎలాట్‌ఫార్మ్‌తో పాటు, ఎంపిక చేసిన థియేటర్లలో భారీ ఎత్తున విడుదల చేయబోతున్నారు. ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో గట్టి టాక్ వినిపిస్తోంది. సెన్సార్ బోర్డ్ వెబ్‌సైట్‌లో కూడా 'గ్లింప్స్ ఆఫ్ డ్రాగన్' పేరుతో సర్టిఫికేట్ పొందినట్లు సమాచారం రావడంతో అభిమానుల్లో అంచనాలు రెట్టింపయ్యాయి. ఈ రాత్రి గ్లింప్స్ ద్వారా టైటిల్‌ను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. సాధారణంగా వచ్చే టీజర్లు లేదా గ్లింప్స్‌లు ఒకటి లేదా రెండు నిమిషాలు మాత్రమే ఉంటాయి. కానీ, ప్రశాంత్ నీల్ ఈసారి భిన్నంగా ఏకంగా 4 నిమిషాల 35 సెకన్ల రన్ టైమ్‌తో ఈ గ్లింప్స్‌ను కట్ చేసినట్లు తెలుస్తోంది. సినిమా యొక్క కథా నేపథ్యాన్ని, ఆ ప్రపంచాన్ని ప్రేక్షకులకు పరిచయం చేయడం కోసమే ఇంత సుదీర్ఘమైన విజువల్స్‌ను ప్లాన్ చేశారట. మైత్రీ మూవీ మేకర్స్ మరియు ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ హై బ్జడెట్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో కన్నడ బ్యూటీ రుక్మిణీ వసంత్ కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ స్టార్ అనిల్ కపూర్ ఒక కీలక పాత్రలో కనిపించనున్నారు. 'కేజీఎఫ్', 'సలార్' చిత్రాలకు ఊపిరి పోసిన రవి బస్రూర్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ క్రేజీ పాన్-ఇండియా విజువల్ వండర్ జూన్ 11, 2027న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.

# 23న భోపాల్‌లో పెద్ది సందడి




రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న చిత్రం 'పెద్ది'. జూన్ 4న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ప్రముఖ నగరాల్లో దీని స్పెషల్ ఈవెంట్‌ను నిర్వహించాలని టీమ్ భావిస్తోంది. తాజాగా ముంబయిలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ జరిగిన విషయం తెలిసిందే. దీని తర్వాత మే 23న మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఏఆర్ రెహమాన్‌తో లైవ్ కాన్సర్ట్‌ను నిర్వహించనున్నారు. భారీ స్థాయిలో జరగనున్న ఈ ఈవెంట్ కోసం టీమ్ పనులు ప్రారంభించింది. తాజాగా భోపాల్‌లోని బీహెచ్‌ఈఎల్ గ్రౌండ్స్‌లో పూజా కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇప్పటికే 'పెద్ది'నుంచి వచ్చిన రెండు పాటలు సూపర్ హిట్‌గా నిలిచి కోట్లలో వ్యూస్‌ను సొంతం చేసుకున్నాయి. ఇప్పుడు స్పెషల్ సాంగ్ రానుండడంతో అందరిలో ఆసక్తి నెలకొంది. 'పెద్ది'లో స్పెషల్ సాంగ్ హైలైట్‌గా నిలుస్తుందని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో బుచ్చిబాబు తెలిపారు. ఆ పాట ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ బ్లాస్ట్ అని పేర్కొన్నారు. ఇక తాజాగా విడుదలైన 'పెద్ది' ట్రైలర్ అన్ని భాషల్లో కలిపి 63 మిలియన్ల వ్యూస్ వచ్చినట్లు టీమ్ తెలిపింది. అన్ని సోషల్ మీడియా వేదికల్లోనూ అది ట్రెండింగ్‌లో ఉందని పేర్కొంది. రామ్‌చరణ్‌కు జోడీగా జాన్వీకపూర్ నటిస్తోన్న ఈ సినిమాలో శివరాజ్ కుమార్, జగపతి బాబు కీలకపాత్రల్లో కనిపించనున్నారు.

# తెలుగులో నా ఫేవరేట్ హీరో ఆయనే..

## ఒక్క ఛాన్స్ వస్తే అస్సలు వదిలిపెట్టను.. హెబ్బా పటేల్ కామెంట్స్..




హెబ్బా పటేల్.. తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే. కన్నడ చిత్రం 'అధ్యక్ష' (2014) ద్వారా వెండితెరకు పరిచయమైన ఈ ముద్దుగుమ్మ.. అదే ఏడాది 'అలా ఎలా' సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చారు. సుకుమార్ కథ అందించిన 'కుమారి 21F' (2015) సినిమా హెబ్బా కెరీర్‌ను మలుపు తిప్పింది. ఈ చిత్రంలో ఆమె నటన, బోల్డ్ క్యారెక్టరైజేషన్ యూత్‌లో విపరీతమైన క్రేజ్ తెచ్చిపెట్టాయి. రాత్రికి రాత్రే ఆమె స్టార్ సెలబ్రిటీగా మారిపోయారు. 'ఈడో రకం ఆడో రకం', 'ఎక్కడికి పోతావు చిన్నవాడా', 'అంధగాడు', 'మిస్టర్' వంటి చిత్రాలు ఆమెకు మంచి గుర్తింపు తెచ్చాయి.కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, హెబ్బా పటేల్ డిఫరెంట్ జోనర్స్‌ను కూడా ట్రై చేశారు. మారుతున్న ట్రెండ్‌కు అనుగుణంగా ఆమె ఓటీటీ ప్లాట్‌ఫార్మ్స్ వైపు కూడా అడుగులు వేశారు. 'మస్తీస్' (జుజు5), 'వ్యవస్థ' (జుజు5) వంటి వెబ్ సిరీస్‌లలో కీలక పాత్రలు పోషించి మెప్పించారు. రామ్ పోతినేని నటించిన 'రెడ్' సినిమాలో "దించక దించక" సాంగ్‌లో స్పెషల్ అప్పీరెన్స్‌తో మాస్ ఆడియన్స్‌ను అలరించారు. ఇటీవలే ఓదెల రైల్వే స్టేషన్ సినిమాతో మరో సక్సెస్ అందుకున్నారు. గతంలో ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తనకు ఇష్టమైన హీరో గురించి వెల్లడించింది. అంతేకాదు అతడితో ఛాన్స్ వస్తే నటించేందుకు రెడీగా ఉన్నట్లు తెలిపింది.ముఖ్యంగా టాలీవుడ్ స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్ (Jr NTR) పై ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇంటర్వ్యూలో తన ఫేవరెట్ యాక్టర్ గురించి అడిగిన ప్రశ్నకు హెబ్బా పటేల్ ఏమాత్రం తడుముకోకుండా జూనియర్ ఎన్టీఆర్ పేరు చెప్పారు. తారక్ నటన, ఆయన పర్సనాలిటీ అంటే తనకు ఎంతో ఇష్టమని పేర్కొన్నారు. 'కుమారి 21ఖ' సినిమా టీజర్ లాంచ్‌కు ఎన్టీఆర్ ముఖ్య అతిథిగా వచ్చినప్పటి నుండి ఆయనపై తనకు ప్రత్యేకమైన అభిమానం ఏర్పడిందని హెబ్బా గుర్తుచేసుకున్నారు. ఎన్టీఆర్ సినిమాతో నటించే అవకాశం వస్తే ఎలాంటి పాత్రకైనా సిద్ధమేనని హెబ్బా పటేల్ స్పష్టం చేశారు.ఆయన సినిమాలో నాకు పెద్దగా ప్రాధాన్యత లేకపోయినా, కథలో ఇంపార్టెంట్ లేకపోయినా పర్వాలేదు. కనీసం నన్ను వెనుక బ్యాక్‌గ్రౌండ్‌లో నిలబెట్టినా నేను ఆ పాత్ర చేయడానికి సిద్ధంగా ఉన్నాను. ఎందుకంటే కొన్నిసార్లు కెరీర్ బ్రేకింగ్ పాత్రల కంటే, మనకున్న బలమైన కోరికలను తీర్చుకోవడం ముఖ్యం" అంటూ తారక్‌పై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు కమెడియన్ సునీల్ చాలా స్వీట్, కేరింగ్ పర్సన్ అని అన్నారు. తన కెరీర్‌లో అత్యంత కంఫర్టబుల్ కోస్టార్ రాజ్ తరుణ్ అని చెప్పారు. ఆయనతో ఎక్కువ సినిమాలు చేయడం వల్ల ఆ బాండింగ్ ఏర్పడిందని, అయితే ఇద్దరం బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేసాం కాబట్టి కొంతకాలం కలిసి నటించకపోవడమే మంచిదని నవ్వుతూ అన్నారుఅలాగే తన కెరీర్‌లో 'ఎక్కడికి పోతావు చిన్నవాడా', '24 కిస్సెస్' చిత్రాల్లో తన నటన తనకు బాగా నచ్చిందని తెలిపారు. ప్రస్తుతానికి తాను పూర్తిగా సింగిల్‌గానే ఉన్నానని హెబ్బా క్లారిటీ ఇచ్చారు. ముంబై (మహారాష్ట్ర) లో జన్మించిన హెబ్బా పటేల్, అక్కడే తన విద్యాభ్యాసాన్ని పూర్తి చేశారు. ఇన్‌స్టాగ్రామ్‌లో హెబ్బా పటేల్ చాలా యాక్టివ్‌గా ఉంటారు. తన గ్లామరస్ ఫోటోషూట్స్, ట్రావెల్ అప్‌డేట్స్‌తో మిలియన్ల కొద్దీ ఫాలోవర్లను అలరిస్తుంటారు. ప్రస్తుతం ఈ అమ్మడు షేర్ చేసిన ప్రతి పోస్ట్ క్షణాల్లో నెట్టింట వైరలవుతుంది. ప్రస్తుతం ఆమె కంటెంట్ ప్రాధాన్యత ఉన్న చిత్రాల్లో నటిస్తుంది.

# అవన్నీ రూమర్లే!



అచ్చ తెలుగందం శ్రీలీలకు యువతరంలో ఉన్న క్రేజ్ గురించి తెలిసిందే. అందుకే ఈ అమ్మడు విజయాలతో సంబంధం లేకుండా భారీ అవకాశాలను అందిపుచ్చుకుంటున్నది. అదే సమయంలో గత కొంతకాలంగా ఈ భామ వ్యక్తిగత జీవితం గురించి రూమర్లు రావడం పరిపాటిగా మారింది. తాజాగా క్రికెటర్ తిలక్‌వర్మతో ఈ ఆమె డేటింగ్‌లో ఉందంటూ సోషల్‌మీడియాలో ప్రచారం జరుగుతున్నది. గత డిసెంబర్‌లో వీరిద్దరూ తిరుమలను సందర్శించడం, ఆపై ముంబయిలో టీ20 మ్యాచ్‌ను తిలకించడంతో డేటింగ్ వార్తలకు మరింత బలం చేకూరినట్లయింది. తాజాగా వీటిపై శ్రీలీల తల్లి స్వర్ణలత స్పందించారు.ఇవన్నీ కేవలం పుకార్లేనని, వాటిలో ఎలాంటి వాస్తవం లేదని, ప్రస్తుతం శ్రీలీల కెరీర్ మీదనే దృష్టి పెట్టిందని వివరణ ఇచ్చారు. మరో ఐదేళ్ల తర్వాతే తన కూతురు పెళ్లి గురించి ఆలోచిస్తానని స్పష్టం చేశారు. గతంలో బాలీవుడ్ హీరో కార్తిక్ ఆర్యన్‌తో శ్రీలీల డేటింగ్‌లో ఉందనే ప్రచారం కూడా జరిగింది. ఈ వార్తలను కూడా స్వర్ణలత ఖండించారు. తానూ, కార్తిక్ ఆర్యన్ తల్లి ఇద్దరం గైనకాలజిస్టులం కావడంతో వృత్తిపరంగా కలుసుకొని అనేక విషయాలు మాట్లాడుకుంటామని, దీనిని కారణంగా చూపించి కార్తిక్ ఆర్యన్, శ్రీలీల మధ్య రిలేషన్‌షిప్ వార్తలను సృష్టించారని ఆమె అసహనం వ్యక్తం చేశారు.

# కాక్‌టెయిల్ -2 ఓ విభిన్నమైన ప్రేమకథ



రష్మిక మందన్న ప్రస్తుతం ముంబైలో బిజీబిజీగా ఉన్నారు. షాహిద్ కపూర్, కృతిసనన్‌లతో కలిసి ఆమె నటించిన 'కాక్‌టెయిల్ 2' చిత్రం జూన్ 19న విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఈ సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా గడుపుతున్నది రష్మిక మందన్న. తాజాగా ముంబైలో ఈ చిత్రబృందం ఓ మ్యూజికల్ ఈవెంట్‌ని నిర్వహించింది. ఈ సందర్భంగా రష్మిక మాట్లాడుతూ "కాక్‌టెయిల్ 2' ఊహలకు అందనంత గొప్పగా ఉంటుంది. ఇది చాలా భిన్నమైన సినిమా. ఈ డిఫరెంట్ ప్రేమకథను అందరూ ఎంజాయ్ చేస్తారు. కృతిసనన్ మామూలుగానే చాలా హాట్. ఈ సినిమాలో మరింత అందంగా కనిపిస్తుంది.షాహిద్‌తో మా ఇద్దరి కెమిస్ట్రీ ఓ రేంజ్‌లో ఉంటుంది. ట్రైలర్స్, టీజర్స్‌లో మీరు చూసింది చాలా తక్కువ. అసలు అప్‌డేట్స్ ముందున్నాయి. వాటికోసం మీతోపాటు నేనూ ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా' అంటూ చెప్పుకొచ్చింది రష్మిక. ఇక 'కాక్‌టెయిల్ 2' సినిమా విషయానికొస్తే.. ఇదొక త్రిముఖ ప్రేమకథ అని తెలుస్తున్నది. హోమీ అదజానియా దర్శకత్వంలో ఈ చిత్రాన్ని రూపొందించారు..

Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365